




PRGI NO: APTEL/26/A7657

జ్యోతి శ్వేత

JYYOTHI SHWETHA

దినపత్రిక

విజయవాడ, హైదరాబాద్ ॥ సంపుటి:1 ॥ సంచిక: 1 ॥ బుధవారం ॥ 16-9-2026 ॥ పేజీలు: 8 ॥ వెల 3/-


16 సెప్టెంబర్ 2026 - బుధవారం శ్రీ పరాభవ నామ సంవత్సరం దక్షిణాయనం - వర్ష ఋతువు భాద్రపద మాసం - శుక్లపక్షం సూర్యోదయం - ఉ. 6:07 సూర్యాస్తమయం - సా. 6:14 తిథి పంచమి ఉ. 9:01 వరకు తరువాత షష్ఠి సంస్కృత వారం సౌమ్య వాసరః నక్షత్రం విశాఖ సా. 5:19 వరకు తరువాత అనురాధ యోగం వైధృతి మ. 12:14 వరకు కరణం భాలవ ఉ. 9:01 వరకు కౌలవ రా. 9:53 వరకు వర్జ్యం రా. 9:47 నుండి రా. 11:33 వరకు దుర్ముహూర్తం ఉ. 11:46 నుండి మ. 12:35 వరకు రాహుకాలం మ. 12:10 నుండి మ. 1:41 వరకు యమగండం ఉ. 7:38 నుండి ఉ. 9:09 వరకు గుళికాకాలం ఉ. 10:40 నుండి మ. 12:10 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:31 నుండి తె. 5:19 వరకు అమృత ఘడియలు ఉ. 7:53 నుండి ఉ. 9:37 వరకు అభిజిత్ ముహూర్తం లేదు గమనిక: "౦" అనగా మరుసటి రోజున



# తెలంగాణ అభివృద్ధికి సహకరించండి

**ఆగా ఖాన్ ఫౌండేషన్‌కు సీఎం రేవంత్ విజ్ఞప్తి**

**విద్య, వైద్యం, పర్యాటక రంగాల్లో భాగస్వామ్యంపై చర్చ**

**మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టును వివరించిన ముఖ్యమంత్రి**

తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల్లో ఆగా ఖాన్ ఫౌండేషన్ మరింత భాగస్వామ్యం కావాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి కోరారు. రాష్ట్రంలోని విద్య, వైద్యం, పర్యాటక రంగాల అభివృద్ధిలో కలిసి పనిచేయాలని విజ్ఞప్తి చేశారు. భారత పర్యటనలో భాగంగా హైదరాబాద్‌కు వచ్చిన ఆగా ఖాన్ ఫౌండేషన్ చైర్మన్ హిజ్ హైనెస్ ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్-5తో తాజ్ ఫలక్‌నుమా ప్యాలెస్‌లో ముఖ్యమంత్రి సమావేశమయ్యారు.

హైదరాబాద్, సెప్టెంబర్ 15: ఈ సంద ర్భంగా తెలంగాణలో ఆగా ఖాన్ ఫౌండేషన్ చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ముఖ్య మంత్రి గుర్తు చేశారు. హైదరాబాద్ నగరం తో ఆగా ఖాన్ కుటుంబానికి ఉన్న చారిత్రక అనుబంధాన్ని ప్రస్తావిస్తూ ఫౌండేషన్ సేవలను ప్రశంసించారు. తెలంగాణ వార సత్వ సంపద పరిరక్షణలో ఫౌండేషన్ కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. శాసన మండలి భవనం, కుతుబ్ షాహీ సమాధుల పునరుద్ధరణలో ఫౌండేషన్ అందించిన సహకారాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించారు. హైదరాబాద్ తరువాయి 2 వ పేజీలో..



# ఆళ్ల నాని ఆకస్మిక మృతి

**గుండెపోటుతో మాజీ డిప్యూటీ సీఎం కన్నుమూత**

**ఏలూరు రాజకీయాల్లో విషాదం**

**నేతలు, కార్యకర్తల సంతాపం**

ఏలూరు, సెప్టెంబర్ 15: ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. మాజీ డిప్యూటీ ముఖ్యమంత్రి ఆళ్ల నాని గుండెపోటుతో హఠాన్మరణం చెందారు. విశాఖపట్నంలోని తన నివాసంలో ఆయనకు అకస్మాత్తుగా గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు వెంటనే ఆసుపత్రికి తరలించే ప్రయత్నం చేసినప్పటికీ అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ వార్త వెలుగులోకి తరువాయి 2 వ పేజీలో..



# సొంతింటి కల సాకారం చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం

**2029 నాటికి అందరికీ సొంతిల్లు**

**హౌసింగ్ ఫర్ ఆల్ అమలుపై సీఎం చంద్రబాబు సమీక్ష**

**2027 మార్చి నాటికి 5.52 లక్షల ఇళ్ల పూర్తి లక్ష్యం**

**పీఎం ఆవాస్ యోజన, పీఎం జన్‌మన్ ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలని ఆదేశం**

అమరావతి, సెప్టెంబర్ 15: రాష్ట్రంలోని అర్హులైన ప్రతి కుటుంబానికి 2029 నాటికి సురక్షితమైన, శాశ్వతమైన సొంత ఇల్లు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం అమలు చేస్తున్న "హౌసింగ్ ఫర్ ఆల్" కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. అమరావతిలోని క్యాంపు కార్యాలయంలో మంగళవారం గృహ నిర్మాణ శాఖపై నిర్వహించిన



# ఆర్టీజీఎస్ సేవలపై సీఎం సమీక్ష

**క్యాంపు కార్యాలయంలో ఆర్టీజీఎస్‌పై సమీక్ష సమావేశం**

**పౌరసేవలు, పథకాల అమలుపై అధికారులతో చర్చ**

**సేవల నాణ్యత పెంపుపై సీఎం సూచనలు**

రాష్ట్రంలో పౌరసేవల అందుబాటు, సంక్షేమ పథకాల అమలు, సాంకేతిక ఆధారిత పాలనపై మరింత దృష్టి సారిస్తూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మంగళవారం ఆర్టీజీఎస్ (రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ) పనితీరుపై సమీక్ష నిర్వహించారు. అమరావతిలోని క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొని ప్రస్తుతం అమలులో ఉన్న సేవలు, వాటి ప్రభావంపై వివరాలను సమర్పించారు.

అమరావతి, సెప్టెంబర్ 15: ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత వేగంగా, పారదర్శకంగా అందించేందుకు చేపడుతున్న చర్యలపై సీఎం అధికారులతో విస్తృతంగా చర్చించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు, అభ్యర్థనల పరిష్కార ప్రక్రియను మరింత సమర్థవంతంగా చేయాలని సూచించారు. ఆర్టీజీఎస్ ద్వారా వివిధ ప్రభుత్వ పథకాల అమలు తీరును నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు సంక్షేమ కార్యక్రమాల అమలులో ఎలాంటి లోపాలు లేకుండా తరువాయి 2 వ పేజీలో..

# రవాణా విస్తరణకు ప్రణాళిక

**నగర శివార్లలో ఆధునిక బస్ టెర్మినల్స్ ఏర్పాటు**

**2,200 ఎలక్ట్రిక్ బస్సులతో రవాణా బలోపేతం: పొన్నం**



హైదరాబాద్, సెప్టెంబర్ 15: హైదరాబాద్ నగరంలో పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీ, వాహన కాలుష్యాన్ని తగ్గించి ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగుతున్నట్లు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. నగర భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రజా రవాణా వ్యవస్థలో కీలక మార్పులు తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు పేర్కొన్నారు. నగరానికి నలువైపులాతరువాయి 2 వ పేజీలో..



# కిశౌ ప్రాజెక్టు ఒప్పందం

**అమిత్ షా సమక్షంలో కిశౌ ప్రాజెక్టు ఒప్పందానికి ఆరు రాష్ట్రాల ఆమోదం**

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 15, : దేశంలో జలవనరుల అభివృద్ధికి కీలకంగా భావిస్తున్న కిశౌ ప్రాజెక్టు అమలుకు సంబంధించి కేంద్ర హోంమంత్రి అమిత్ షా, జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ సమక్షంలో ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్, రాజస్థాన్, ఢిల్లీ, హర్యానా రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈ ఒప్పందం ద్వారా దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టు అమలుకు మార్గం సుగమమైందని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. సంబంధిత రాష్ట్రాల (మిగతా 2వ పేజీలో)



# ఉపరాష్ట్రపతి పర్యటనకు విస్తృత ఏర్పాట్లు

**అధికారులతో సమీక్ష నిర్వహించిన ప్రధాన కార్యదర్శి**

**పరేడ్ గ్రౌండ్‌లో కార్యక్రమానికి ఏర్పాట్లు ముమ్మరం**

**విమోచన దినోత్సవ కార్యక్రమంలో పాల్గొననున్న ఉపరాష్ట్రపతి**

హైదరాబాద్, సెప్టెంబర్ 15: సెప్టెంబర్ 17న హైదరాబాద్ నగరంలో జరగనున్న రాష్ట్ర ఉపరాష్ట్రపతి సి.పీ. రాధాకృ ష్ణన్ పర్యటనకు విస్తృత ఏర్పాట్లు చేపట్టినట్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు తెలిపారు. ఉపరాష్ట్రపతి పర్యటన ఏర్పా ట్లపై మంగళవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్క ర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో సంబంధిత శాఖల కార్యదర్శులు, పోలీసు అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించే తెలంగాణ విమోచన దినోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా (మిగతా 2వ పేజీలో

## నేటి రాశి ఫలాలు

**మేషం:** నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. వ్యాపారాలు సజావుగా సాగుతాయి. సంతానం నుండి శుభవార్తలు అందుతాయి. దైవదర్శనాలు చేసుకుంటారు. ఉద్యోగమున పదోన్నతులు పెరుగుతాయి. ఆర్థిక అనుకూలత కలుగుతుంది. పాతమిత్రుల కలయిక ఆనందం కలిగిస్తుంది.

**వృషభం:** వృత్తి, వ్యాపారాలు సామాన్యంగా సాగుతాయి. ఆర్థిక లావాదేవీలు నిరాశ కలిగిస్తాయి. చేపట్టిన పనులు మందకోడిగా సాగుతాయి. ఇంటా బయట ఒత్తిడి పెరుగుతుంది. ఆరోగ్య విషయంలో జాగ్రత్త అవసరం. బంధువులతో చిన్నపాటి వివాదాలు తప్పవు.

**మిధునం:** నూతన వాహనయోగం ఉన్నది. వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. చేపట్టిన పనులలో కార్యసిద్ధి కలుగుతుంది. ఉద్యోగులకు జీతభత్యాల విషయంలో శుభవార్తలు అందుతాయి. గృహమున బంధు మిత్రులతో ఉత్సాహంగా గడుపుతారు. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది.

**కర్కాటకం:** వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. నిరుద్యోగుల కష్టం ఫలిస్తుంది. నూతన వ్యక్తుల పరిచయం ఉత్సాహాన్నిస్తుంది. బంధువుల నుంచి శుభవార్తలు అందుతాయి. నూతన వాహనయోగం ఉన్నది. దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. ఆకస్మిక ధనలాభ సూచనలున్నవి.

**సింహం:** అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. నూతన ఋణాలు చేస్తారు. వృధా ప్రయాణాలు చెయ్యవలసి వస్తుంది. వ్యాపార, ఉద్యోగాలలో చికాకు తప్పవు. కుటుంబ వ్యవహారాలలో సొంత ఆలోచనలు కలసిరావు. బంధువులతో ఆకస్మిక తగాదాలు ఉంటాయి.

**కన్య:** నూతన ఋణాలు చేస్తారు. వ్యాపారాలు స్వల్పంగా లాభిస్తాయి. కుటుంబ సమస్యల వలన మానసిక ప్రశాంతత ఉండదు. ఆకస్మిక ప్రయాణ సూచనలున్నవి. ఉద్యోగాలలో కొంత గందరగోళ పరిస్థితులుంటాయి. ఆరోగ్య విషయంలో అశ్రద్ధ చెయ్యడం మంచిది కాదు. చేపట్టిన పనుల్లో అవాంతరాలు తప్పవు.

**తుల:** ఉద్యోగమున ముఖ్య నిర్ణయాలు తీసుకుంటారు. దూరపు బంధువుల నుండి శుభవార్తలు అందుతాయి. వ్యాపారాలు గతం కంటే మెరుగవుతాయి. నిరుద్యోగ ప్రయత్నాలు ఫలిస్తాయి. చేపట్టిన పనుల్లో విజయం సాధిస్తారు. నూతన వస్తు వాహనాలు కొనుగోలు చేస్తారు.

**వృశ్చికం:** దైవ సేవా కార్యక్రమాలలో కుటుంబ సభ్యులతో పాల్గొంటారు. ఇంటాబయట అనుకూల వాతావరణం ఉంటుంది. వ్యాపారాలు విస్తరిస్తారు. ఆప్తుల నుండి కొత్త విషయాలు తెలుసుకుంటారు. వృత్తి ఉద్యోగాలలో మీ ప్రతిభ వెలుగులోకి వస్తుంది.

**ధనస్సు:** చేపట్టిన పనులలో శ్రమ పెరుగుతుంది. వ్యాపార ఉద్యోగాలు నిరుత్సాహపరుస్తాయి. కుటుంబ సభ్యులతో చిన్నపాటి విభేదాలు తప్పవు. దైవ చింతన పెరుగుతుంది. ఆర్థిక ఇబ్బందుల వలన నూతన ఋణ ప్రయత్నాలు చేస్తారు. ప్రయాణాలు వాయిదా వేయడం మంచిది.

**మకరం:** సోదరులతో స్థిరాస్తి వివాదాలు కలుగుతాయి. ముఖ్యమైన వ్యవహారాలు నత్తనడకన సాగుతాయి. అశ్రద్ధ చేయడం మంచిది కాదు. ఉద్యోగాలలో అధికారుల నుండి విమర్శలు తప్పవు. పాత ఋణాలు తీర్చడానికి నూతన ఋణాలు చేస్తారు. వృత్తి వ్యాపారాలలో శ్రమకు తగ్గ ఫలితం కనిపించదు.

**కుంభం:** వృత్తి, వ్యాపారాలు సాఫీగా సాగుతాయి. నూతన వాహనం కొనుగోలు చేస్తారు. నిరుద్యోగులకు నూతన ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. ముఖ్యమైన వ్యవహారాలు ఆశించిన విధంగా సాగుతాయి. చేపట్టిన పనులు సకాలంలో పూర్తి చేస్తారు. ఆత్మీయుల నుంచి శుభవార్తలు అందుకుంటారు.

**మీనం:** వృత్తి వ్యాపారాలలో శ్రమాధిక్యత పెరుగుతుంది. చిన్ననాటి మిత్రులతో వివాదాలకు దూరంగా ఉండటం మంచిది. ఉద్యోగాలలో అధికారుల నుంచి ఒత్తిడి పెరుగుతుంది. దూర ప్రయాణ సూచనలు ఉన్నవి. ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతాయి. ముఖ్యమైన పనులు వాయిదా వేస్తారు.



# తెలంగాణ అభివృద్ధికి సహకరించండి

**మొదటి పేజీ తరువాయి**

నగర పునర్నిర్మాణంలో భాగంగా చేపడుతున్న మూసీ నది పునరుజ్జీవన ప్రాజెక్టు గురించి ముఖ్యమంత్రి వివరించారు. మూసీ నది తీరాన్ని ఆధునిక సదుపాయాలతో అభివృద్ధి చేస్తూ రాత్రి వేళ ఆర్థిక కార్యకలాపాలకు కేంద్రంగా తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. మూసీ పరివాహక ప్రాంతంలోని చారిత్రక సిటీ కళాశాల, ఉస్మానియా ఆసుపత్రి భవనాల పునరుద్ధరణలో ఫౌండేషన్ సహకారం అందించాలని కోరారు. ఉస్మానియా ఆసుపత్రికి గోషామహల్‌లో కొత్త భవనం నిర్మిస్తున్నామని, ప్రస్తుతం ఉన్న భవనాన్ని వారసత్వ కట్టడంగా సంరక్షించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని ముఖ్యమంత్రి తెలిపారు. చారిత్రక కట్టడాల పరిరక్షణతో పాటు పర్యాటక అభివృద్ధికి కూడా ప్రాధాన్యం ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో ఆగా ఖాన్ ఫౌండేషన్ భాగస్వామ్యం రాష్ట్రానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అభిప్రాయపడ్డారు.

డిసెంబర్ 7 నుంచి 9 వరకు భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ ప్రపంచ సదస్సుకు హాజరు కావాలని ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్‌ను ముఖ్యమంత్రి ఆహ్వానించారు. ఈ సదస్సుకు వందకు పైగా దేశాల ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. ఫ్యూచర్ సిటీ నిర్మాణంపై ఆసక్తి వ్యక్తం చేసిన ప్రిన్స్ రహీమ్‌కు, 30 వేల ఎకరాల్లో అత్యాధునిక సదుపాయాలతో పూర్తిగా కాలుష్య రహిత నగరాన్ని అభివృద్ధి చేస్తున్నామని ముఖ్యమంత్రి వివరించారు. సింగపూర్‌కు చెందిన సంస్థ ఫ్యూచర్ సిటీ ప్రధాన ప్రణాళికను రూపొందిస్తోందని, దాదాపు 15 వేల ఎకరాల్లో హరిత ప్రాంతాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. 2047 నాటికి దేశ స్థూల దేశీయోత్పత్తిలో తెలంగాణ వాటాను 10 శాతానికి పెంచాలన్న లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని చెప్పారు. సమావేశంలో మంత్రి మహమ్మద్ అజారుద్దీన్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ముఖ్యమంత్రి సలహాదారు కె. రామకృష్ణారావు, ఉన్నతాధికారులు, ఆగా ఖాన్ ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఆళ్ల నాని ఆకస్మిక మృతి

**మొదటి పేజీ తరువాయి**

రావడంతో ఏలూరు నియోజకవర్గంతో పాటు రాష్ట్ర రాజకీయ వర్గాల్లో తీవ్ర విషాదం నెలకొంది. ఆయన ఆకస్మిక మరణం పార్టీ శ్రేణులను, అభిమానులను దిగ్భ్రాంతికి గురిచేసింది.

ఆళ్ల నాని 1969లో ఏలూరులోని శనివారపుపేటలో జన్మించారు. చిన్ననాటి నుంచే సామాజిక కార్యక్రమాల పట్ల ఆసక్తి కనబరిచిన ఆయన విద్యాభ్యాసాన్ని ఏలూరులోనే పూర్తి చేశారు. సి.ఆర్. రెడ్డి కళాశాలలో ఇంటర్మీడియట్ చదివిన అనంతరం ఆంధ్రా యూనివర్సిటీ పరిధిలో బీకామ్ పట్టా పొందారు. విద్యార్థి దశ నుంచే ప్రజా సమస్యలపై స్పందిస్తూ రాజకీయాల వైపు అడుగులు వేశారు. కాంగ్రెస్ పార్టీ ద్వారా రాజకీయ ప్రస్థానం ప్రారంభించిన ఆళ్ల నాని 2004లో తొలిసారిగా ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ప్రజలతో సన్నిహితంగా మెలుగుతూ స్థానిక సమస్యల పరిష్కారంలో చురుకైన పాత్ర పోషించారు. 2009లో మరోసారి కాంగ్రెస్ అభ్యర్థిగా విజయం సాధించి తన రాజకీయ బలాన్ని చాటుకున్నారు. ఏలూరులో ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఏర్పడటానికి ఈ కాలం కీలకంగా మారింది.

రాష్ట్ర రాజకీయ పరిణామాల నేపథ్యంలో 2013లో కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసిన ఆళ్ల నాని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. అనంతరం పార్టీ బలోపేతానికి కృషి చేసిన ఆయన 2017లో వైసీపీ తరపున ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. 2019 అసెంబ్లీ ఎన్నికల్లో ఏలూరు నుంచి ఎమ్మెల్యేగా విజయం సాధించి రాష్ట్ర మంత్రివర్గంలో చోటు దక్కించుకున్నారు. ఉప ముఖ్యమంత్రిగా, వైద్య ఆరోగ్య శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తూ కరోనా కాలంలో కీలక నిర్ణయాల్లో భాగస్వామ్యమయ్యారు.

గత ఎన్నికల అనంతరం వైసీపీని వీడిన ఆళ్ల నాని రాజకీయంగా మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. 2025 ఏప్రిల్‌లో తెలుగుదేశం పార్టీలో చేరి తన రాజకీయ ప్రస్థానాన్ని కొనసాగించారు. వివిధ పార్టీల్లో పనిచేసినా ప్రజలతో అనుబంధాన్ని కొనసాగించడంలో ఆయన ప్రత్యేక గుర్తింపు పొందారు. రాజకీయ ప్రత్యర్థులతో కూడా స్నేహపూర్వక సంబంధాలు కొనసాగించడం ఆయన వ్యక్తిత్వంలోని విశేషంగా చెప్పబడుతోంది.

ఆళ్ల నాని మృతి పట్ల రాష్ట్రవ్యాప్తంగా రాజకీయ నాయకులు, వివిధ పార్టీల ప్రతినిధులు సంతాపం వ్యక్తం చేస్తున్నారు. ఏలూరులో ఆయన భౌతికకాయాన్ని దర్శించుకునేందుకు అభిమానులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున తరలివస్తున్నారు. ఆయన సేవలను స్మరించుకుంటూ నివాళులు అర్పిస్తున్నారు. ప్రజా జీవితంలో మూడు దశాబ్దాలకుపైగా కొనసాగిన ఆయన రాజకీయ ప్రయాణం అకస్మాత్తుగా ముగియడం ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో తీరని లోటుగా భావిస్తున్నారు.

# ఆళ్ల నాని మృతిపై చంద్రబాబు దిగ్భ్రాంతి

### మాజీ డిప్యూటీ సీఎం మరణంపై సంతాపం

### కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి

అమరావతి, సెప్టెంబర్ 15: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి, టీడీపీ నేత ఆళ్ల నాని (కాళీ కృష్ణ శ్రీనివాస్) అకాల మరణం పట్ల ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కేవలం 56 ఏళ్ల వయసులోనే గుండెపోటుతో ఆళ్ల నాని మరణించడం తనను తీవ్రంగా కలచివేసిందని పేర్కొన్నారు. ఆయన మరణం రాజకీయ రంగానికి తీరని లోటని అభిప్రాయపడుతూ, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆళ్ల నాని మృతి నేపథ్యంలో చంద్రబాబు నాయుడు సోషల్ మీడియా వేదికగా సంతాప సందేశాన్ని విడుదల చేశారు. ఆళ్ల నాని ఆత్మకు శాంతి చేకూర్చాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నానని పేర్కొన్నారు. ఈ క్లిష్ట సమయంలో ఆయన కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని ఆకాంక్షిస్తూ తన సానుభూతిని వ్యక్తం చేశారు. రాజకీయ జీవితంలో వివిధ పార్టీల్లో పనిచేసిన ఆళ్ల నాని ప్రజలకు చేరువైన నాయకుడిగా గుర్తింపు పొందారు. ఏలూరు నియోజకవర్గం నుంచి పలుమార్లు ప్రజాప్రతినిధిగా ఎన్నికైన ఆయన రాష్ట్ర రాజకీయాల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు.

# ఆర్టీజీఎస్ సేవలపై సీఎం సమీక్ష

**మొదటి పేజీ తరువాయి**

పర్యవేక్షణ వ్యవస్థను బలోపేతం చేయాలని పేర్కొన్నారు. ప్రజలకు అందే సేవల నాణ్యతను పెంచడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. పౌరసేవల డెలివరీలో సాంకేతికత వినియోగాన్ని మరింత విస్తరించాలని సీఎం సూచించారు. ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయాన్ని పెంచి, డేటా ఆధారిత నిర్ణయాలతో పరిపాలనను మరింత సమర్థవంతంగా నిర్వహించే దిశగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజల అవసరాలను ముందుగానే గుర్తించి పరిష్కరించే విధంగా వ్యవస్థలను అభివృద్ధి చేయాలన్నారు.

సంక్షేమ పథకాల అమలులో లబ్ధిదారులకు ఎదురయ్యే సమస్యలను వెంటనే గుర్తించి పరిష్కరించేలా ఆర్టీజీఎస్ వ్యవస్థ పనిచేయాలని సమావేశంలో చర్చించారు. ప్రభుత్వ సేవలు ప్రతి అర్హుడికి సకాలంలో చేరేలా శాఖలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సీఎం సూచించారు. ప్రజల సంతృప్తే ప్రభుత్వ పనితీరుకు అసలైన కొలమానమని పేర్కొన్నారు. సమీక్ష అనంతరం అధికారులు వివిధ రంగాల్లో అమలవుతున్న పర్యవేక్షణ వ్యవస్థలు, ప్రజా సేవల డిజిటలైజేషన్, సంక్షేమ కార్యక్రమాల పురోగతిపై ముఖ్యమంత్రికి వివరించారు. ప్రజాకేంద్రిత పాలన, వేగవంతమైన సేవలందింపు, సాంకేతిక ఆధారిత పరిపాలన లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందని సమావేశంలో స్పష్టమైంది.

# రవాణా విస్తరణకు సమగ్ర ప్రణాళిక

**మొదటి పేజీ తరువాయి**

ఆధునిక బస్ టెర్మినల్స్ ఏర్పాటు చేసి రవాణా వ్యవస్థను మరింత సమర్థవంతంగా మార్చనున్నట్లు వెల్లడించారు. ఈ ప్రణాళికలో భాగంగా గాజులరామారం, శంషాబాద్, ఎల్బీనగర్, ఘట్కేసర్ ప్రాంతాల్లో ఆధునిక బస్ టెర్మినల్స్ ఏర్పాటు చేసే ప్రతిపాదనలను పరిశీలిస్తున్నట్లు మంత్రి తెలిపారు. కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్రతో పాటు ఔటర్ రింగ్ రోడ్డు వైపు నుంచి వచ్చే దూరప్రాంత, అంతర్‌జిల్లా, అంతర్రాష్ట్ర బస్సులను నగర మధ్య ప్రాంతాల్లోకి అనుమతించకుండా ఆయా టెర్మినల్స్ వరకే పరిమితం చేసే విధానాన్ని అమలు చేయనున్నట్లు చెప్పారు. దీనివల్ల నగర రహదారులపై వాహనాల ఒత్తిడి గణనీయంగా తగ్గే అవకాశం ఉందన్నారు. టెర్మినల్స్ నుంచి ప్రయాణికులు తమ గమ్యస్థానాలకు సులభంగా చేరుకునేలా సిటీ ఆర్టీసీ బస్సులు, మెట్రో రైలు, ఎంఎంటీఎస్ సేవలను సమన్వయం చేస్తూ లాస్ట్ మైల్ కనెక్టివిటీని బలోపేతం చేయనున్నట్లు మంత్రి వివరించారు. ప్రయాణికులకు వేగవంతమైన, సౌకర్యవంతమైన ప్రజా రవాణా అందుబాటులోకి రావడంతో పాటు వ్యక్తిగత వాహనాల వినియోగం కూడా తగ్గుతుందని అభిప్రాయపడ్డారు. ప్రజా రవాణాపై మరింత విశ్వాసం పెరిగేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

నగరంలో ప్రైవేట్ బస్సుల అనియంత్రిత పార్కింగ్, రాత్రి వేళల్లో పెద్ద సంఖ్యలో నగరంలోకి ప్రవేశించడం వల్ల ట్రాఫిక్ సమస్యలు పెరుగుతున్నాయని మంత్రి పేర్కొన్నారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారంగా ప్రైవేట్ బస్సులను కూడా నిర్దేశిత టెర్మినల్స్ ద్వారానే నిర్వహించే విధానాన్ని పరిశీలిస్తున్నట్లు చెప్పారు. అవసరమైన నిబంధనల ప్రకారం యూజర్ ఛార్జీలతో టెర్మినల్స్ వినియోగించే విధానాన్ని రూపొందించనున్నట్లు వెల్లడించారు.

బస్ టెర్మినల్స్ ఏర్పాటుకు అవసరమైన భూమి కేటాయింపుపై ప్రభుత్వం సానుకూలంగా ఉందని మంత్రి తెలిపారు. గాజులరామారం ప్రాంతంలో సుమారు 100 ఎకరాలు, శంషాబాద్ ప్రాంతంలో సుమారు 150 ఎకరాల భూమిని టెర్మినల్ అవసరాలకు కేటాయించే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు చెప్పారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని టెర్మినల్స్‌ను ఆధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేస్తామని, ప్రయాణికులకు వేచి ఉండే ప్రదేశాలు, పార్కింగ్, మెరుగైన రవాణా అనుసంధానం వంటి అన్ని సదుపాయాలు కల్పిస్తామని వివరించారు. హైదరాబాద్ ప్రజా రవాణాను మరింత బలోపేతం చేసేందుకు రానున్న 2,200 ఎలక్ట్రిక్ బస్సులను సమర్థవంతంగా వినియోగించనున్నట్లు మంత్రి తెలిపారు. టెర్మినల్స్ నుంచి నగరంలోని అన్ని ప్రాంతాలకు కొత్త రూట్లను రూపొందించి ప్రయాణికులకు సౌకర్యవంతమైన సేవలు అందించనున్నట్లు చెప్పారు. టెర్మినల్ ఆధారిత ప్రజా రవాణా వ్యవస్థ ద్వారా నగర ప్రధాన రహదారులపై ట్రాఫిక్ రద్దీ, వాహన కాలుష్యాన్ని తగ్గించి హైదరాబాద్‌ను సుస్థిరమైన, ఆధునిక ప్రజా రవాణా నగరంగా తీర్చిదిద్దడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు.

## కిశౌ ప్రాజెక్టు ఒప్పందానికి ఆరు రాష్ట్రాల ఆమోదం

(మొదటి పేజీ తరువాయి

మధ్య సమన్వయంతో ప్రాజెక్టు పనులను వేగవంతం చేయనున్నట్లు తెలిపింది. ఈ సందర్భంగా అమిత్ షా మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం కిశౌ ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించిందన్నారు. ప్రాజెక్టు నిర్మాణానికి అయ్యే మొత్తం వ్యయంలో సుమారు 90 శాతం భారాన్ని కేంద్ర ప్రభుత్వమే భరిస్తుందని చెప్పారు. మిగిలిన 10 శాతం వ్యయాన్ని 1994 ఒప్పందం ప్రకారం భాగస్వామ్య రాష్ట్రాలు భరించనున్నట్లు వివరించారు. జాతీయ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఈ ప్రాజెక్టును అత్యంత ప్రాధాన్యంతో అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. కిశౌ ప్రాజెక్టు కింద ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాల సరిహద్దు ప్రాంతంలో ప్రవహించే టాన్స్ నదిపై 232.6 మీటర్ల ఎత్తుతో భారీ కాంక్రీట్ గ్రావిటీ డ్యామ్ నిర్మించనున్నారు. ఈ డ్యామ్‌లో 1,562 మిలియన్ క్యూబిక్ మీటర్ల నీటి నిల్వ సామర్థ్యం ఉండనుంది. ప్రాజెక్టు పూర్తయిన తర్వాత నీటి నిల్వ, పంపిణీ, వరద నియంత్రణ వ్యవస్థలు మరింత సమర్థవంతంగా మారనున్నాయని అధికారులు తెలిపారు. ఈ ప్రాజెక్టు ద్వారా సుమారు 97 వేల హెక్టార్ల భూమికి సాగునీరు అందించనున్నారు. ముఖ్యంగా వ్యవసాయాధారిత ప్రాంతాల్లో నీటి లభ్యత పెరగడం వల్ల రైతులకు గణనీయమైన ప్రయోజనం కలగనుంది.

## విస్తృత ఏర్పాట్లు

(మొదటి పేజీ తరువాయి

హాజరయ్యేందుకు ఉపరాష్ట్రపతి హైదరాబాద్‌కు రానున్నారని తెలిపారు. పర్యటన సందర్భంగా ఎలాంటి లోపాలు తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఉపరాష్ట్రపతి సెప్టెంబర్ 17న ఉదయం 8.30 గంటలకు హైదరాబాద్ చేరుకుని, ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించే కార్యక్రమంలో పాల్గొంటారని వివరించారు. ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరయ్యే అవకాశం ఉన్నందున ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి సంబంధించిన వేదిక, భద్రత, రవాణా, వైద్య సేవలు, పారిశుద్ధ్యం తదితర అంశాలపై సమగ్ర కార్యాచరణ రూపొందించినట్లు వెల్లడించారు. కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

## సొంతింటి కల సాకారం చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి

సమీక్షా సమావేశంలో ఆయన పలు కీలక సూచనలు చేశారు. రాష్ట్రంలో గృహహీన కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన-- గ్రామీణ్, పీఎం జన్‌మన్ సహా వివిధ పథకాల కింద చేపట్టాల్సిన గృహ నిర్మాణాలను వచ్చే నెలలోగా పూర్తిస్థాయిలో గ్రౌండింగ్ చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. ఇప్పటికే మంజూరైన ఇళ్ల నిర్మాణ పనులను వేగంగా ప్రారంభించి నిర్దేశిత గడువుల్లో పూర్తి చేసేలా ప్రత్యేక కార్యాచరణ అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి జిల్లాలో పురోగతిని క్రమం తప్పకుండా సమీక్షిస్తూ లక్ష్య సాధనకు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాల ప్రకారం 2027 మార్చి నాటికి మొత్తం 5.52 లక్షల ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేయాలని సీఎం స్పష్టం చేశారు. ఇందులో భాగంగా 2026 డిసెంబరు నాటికి 2.05 లక్షల ఇళ్లను పూర్తి చేసి లబ్ధిదారులకు అందుబాటులోకి తీసుకురావాలని, అనంతరం 2027 మార్చి నాటికి మరో 2.74 లక్షల ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేసి గృహప్రవేశాలకు సిద్ధం చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

శ్వేత

# సంపాదకీయం

**బుధవారం 16-9-2026**

# ప్రకటనల నుంచి కార్యాచరణకు ఎంత దూరం?

ప్రపంచ దేశాల నాయకులు తరచూ శిఖరాగ్ర సమావేశాల్లో పాల్గొంటూ పలు కీలక అంశాలపై చర్చలు జరుపుతుంటారు. ఇటీవల న్యూఢిల్లీలో జరిగిన బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు కూడా అంతర్జాతీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. స్థానిక కరెన్సీల్లో వాణిజ్యం, కృత్రిమ మేధస్సు, ఆహార భద్రత, ఇంధన భద్రత, ఆరోగ్య రంగం, అభివృద్ధి చెందుతున్న దేశాల ప్రయోజనాలు వంటి అనేక అంశాలపై సభ్య దేశాలు విస్తృతంగా చర్చించాయి. కొత్త ఢిల్లీ ప్రకటన ద్వారా పలు నిర్ణయాలను ప్రకటించాయి. అయితే ఇలాంటి సమావేశాల అనంతరం ప్రజల్లో తలెత్తే ప్రధాన ప్రశ్న ఒక్కటే. ఇవన్నీ కేవలం ప్రకటనలకే పరిమితమవుతాయా? లేక నిజంగా ఆచరణలోకి వచ్చి ప్రజల జీవితాల్లో మార్పు తీసుకువస్తాయా? బ్రిక్స్ వంటి అంతర్జాతీయ వేదికల ప్రాముఖ్యతను తక్కువగా అంచనా వేయలేం. ప్రపంచ జనాభాలో దాదాపు సగం మందికి ప్రాతినిధ్యం వహిస్తున్న ఈ కూటమి ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో కూడా కీలక పాత్ర పోషిస్తోంది. సభ్య దేశాల మధ్య సహకారం పెరగడం, అభివృద్ధి చెందుతున్న దేశాల స్వరాన్ని బలంగా వినిపించడం, అంతర్జాతీయ సంస్థల్లో సంస్కరణలను కోరడం వంటి అంశాలు ప్రపంచ రాజకీయాల్లో ప్రభావం చూపుతున్నాయి. అయితే సమావేశాలు జరిగాయని, ప్రకటనలు విడుదలయ్యాయని మాత్రమే ప్రజలకు ప్రత్యక్ష ప్రయోజనం కలగదు. ఆ నిర్ణయాలు నేలస్థాయిలో అమలైనప్పుడే వాటి అసలు విలువ తెలుస్తుంది.

ఈసారి బ్రిక్స్ సమావేశంలో స్థానిక కరెన్సీల్లో వాణిజ్యాన్ని ప్రోత్సహించడంపై ప్రత్యేక దృష్టి పెట్టారు. సభ్య దేశాల మధ్య డాలర్‌పై ఆధారపడకుండా నేరుగా స్థానిక కరెన్సీల్లో లావాదేవీలు జరగడం వల్ల మారకపు విలువల ఒత్తిడి తగ్గే అవకాశం ఉంది. వాణిజ్య ఖర్చులు తగ్గవచ్చు. దిగుమతి, ఎగుమతి ప్రక్రియలు మరింత సులభం కావచ్చు. దీని ప్రభావం చివరికి వినియోగదారులపై కూడా పడే అవకాశం ఉంది. అయితే ఈ లక్ష్యాన్ని సాధించడానికి బ్యాంకింగ్ వ్యవస్థల అనుసంధానం, చెల్లింపుల విధానాల సమన్వయం, సభ్య దేశాల మధ్య విశ్వాసం వంటి అనేక అంశాలు పరిష్కారం కావాల్సి ఉంది. కృత్రిమ మేధస్సు, డిజిటల్ మౌలిక వసతులు, ఆరోగ్య రంగాల్లో సహకారం పెంచాలని కూడా బ్రిక్స్ నిర్ణయించింది. ఇవి విజయవంతంగా అమలైతే అభివృద్ధి చెందుతున్న దేశాలకు తక్కువ ఖర్చుతో మెరుగైన సాంకేతిక పరిజ్ఞానం అందే అవకాశం ఉంటుంది. డిజిటల్ సేవలు మరింత విస్తరించవచ్చు. ఆరోగ్య రంగంలో కొత్త పరిశోధనలు, వ్యాధులపై ముందస్తు హెచ్చరిక వ్యవస్థలు, శిక్షణ కార్యక్రమాలు బలోపేతం కావచ్చు. కానీ ఈ నిర్ణయాలు ఫైళ్లలోనే మిగిలిపోతే ప్రజలకు ఎలాంటి ఉపయోగం ఉండదు.

ఇక ఆహార భద్రత, వ్యవసాయ సహకారం వంటి అంశాలు కూడా సామాన్య ప్రజలకు అత్యంత సంబంధం ఉన్నవే. వాతావరణ మార్పులు, ప్రకృతి విపత్తులు, సరఫరా వ్యవస్థల అంతరాయాల కారణంగా ప్రపంచవ్యాప్తంగా ఆహార భద్రత ఒక సవాలుగా మారుతోంది. బ్రిక్స్ దేశాలు వ్యవసాయ సాంకేతికత, డిజిటల్ వ్యవసాయం, స్థిరమైన సాగు పద్ధతులపై కలిసి పనిచేస్తే రైతులకు కొత్త అవకాశాలు లభించవచ్చు. వ్యవసాయ ఉత్పాదకత పెరగవచ్చు. ఆహార ధరల స్థిరత్వానికి కూడా ఇది తోడ్పడే అవకాశం ఉంది. అంతర్జాతీయ వేదికలపై మరో ప్రధాన విమర్శ ఏమిటంటే ప్రకటనలు గొప్పగా ఉంటాయి కానీ అమలు నెమ్మదిగా సాగుతుంది. గతంలో కూడా అనేక శిఖరాగ్ర సమావేశాల్లో పలు నిర్ణయాలు ప్రకటించినప్పటికీ వాటిలో కొన్ని మాత్రమే పూర్తిస్థాయిలో అమలయ్యాయి. సభ్య దేశాల రాజకీయ ప్రయోజనాలు, ఆర్థిక పరిస్థితులు, భౌగోళిక విభేదాలు, వ్యూహాత్మక భేదాభిప్రాయాలు అమలుకు అడ్డంకులుగా మారుతుంటాయి. బ్రిక్స్‌లో కూడా వివిధ దేశాల ప్రయోజనాలు వేర్వేరుగా ఉండటం వల్ల ప్రతి నిర్ణయం వేగంగా అమలవుతుందని చెప్పలేం.

అయితే దీనర్థం ఇలాంటి సమావేశాలు వ్యర్థమని కాదు. అంతర్జాతీయ సంబంధాల్లో పెద్ద మార్పులు ఒక్కరోజులో రావు. మొదట చర్చలు జరుగుతాయి. ఆ తర్వాత విధానాలు రూపొందుతాయి. అనంతరం సంస్థాగత వ్యవస్థలు ఏర్పడతాయి. చివరికి ప్రజలకు ప్రయోజనాలు చేరుతాయి. ఈ ప్రక్రియకు కొన్నిసార్లు సంవత్సరాలు పట్టవచ్చు. కాబట్టి సమావేశాల విలువను కేవలం తక్షణ ఫలితాల ఆధారంగా మాత్రమే అంచనా వేయడం సరైంది కాదు. కానీ అమలు దిశగా పురోగతి కనిపించాల్సిన అవసరం మాత్రం ఉంది. ప్రజల దృష్టిలో చూస్తే అంతర్జాతీయ సమావేశాల విజయాన్ని కొలిచే ప్రమాణం చాలా సరళమైనది. ఉద్యోగ అవకాశాలు పెరిగాయా? ధరలు తగ్గాయా? వ్యాపార అవకాశాలు మెరుగుపడ్డాయా? సాంకేతికత అందుబాటులోకి వచ్చిందా? రైతులు, విద్యార్థులు, చిన్న వ్యాపారులు ప్రయోజనం పొందారా? అనే ప్రశ్నలకు సమాధానం దొరికినప్పుడే ప్రజలు వాటి ప్రాముఖ్యతను గుర్తిస్తారు. అందువల్ల ప్రభుత్వాలు ప్రకటనలతో పాటు అమలుకు స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికను కూడా ప్రజల ముందుంచాలి.

ప్రపంచ వ్యవస్థలో అభివృద్ధి చెందుతున్న దేశాల పాత్ర పెరుగుతున్న సమయంలో బ్రిక్స్ వంటి వేదికలకు మరింత ప్రాధాన్యం ఏర్పడుతోంది. ఐక్యరాజ్యసమితి, అంతర్జాతీయ ద్రవ్య నిధి, ప్రపంచ బ్యాంకు వంటి సంస్థల్లో సంస్కరణల కోసం ఈ దేశాలు గళం వినిపిస్తున్నాయి. అభివృద్ధి చెందుతున్న దేశాలకు ఎక్కువ ప్రాతినిధ్యం కల్పించాలని కోరుతున్నాయి. ఈ లక్ష్యాలు నెరవేరితే ప్రపంచ నిర్ణయ ప్రక్రియలో సమతుల్యత పెరిగే అవకాశం ఉంది. అంతిమంగా చూస్తే బ్రిక్స్ సదస్సు విజయాన్ని నిర్ణయించేది విడుదలైన ప్రకటన కాదు, అమలైన నిర్ణయాలు. సమావేశాలు చర్చలకు వేదిక కావచ్చు. ప్రకటనలు దిశానిర్దేశం చేయవచ్చు. కానీ ప్రజల జీవితాల్లో మార్పు తీసుకువచ్చేది కార్యాచరణ మాత్రమే. అందువల్ల బ్రిక్స్ దేశాలు తీసుకున్న నిర్ణయాలు కాగితాలపై కాకుండా క్షేత్రస్థాయిలో అమలవుతున్నాయా అనే అంశంపైనే భవిష్యత్తులో ఈ సదస్సుల అసలు ప్రభావం ఆధారపడి ఉంటుంది. ప్రజలకు కనిపించే ఫలితాలే ఏ అంతర్జాతీయ సమావేశానికైనా నిజమైన విజయప్రమాణం.



# ప్రజా సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు

**నక్కపల్లి ఎంపీడీవో కార్యాలయంలో సమీక్ష సమావేశం**

**అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ**

**ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకున్న మంత్రి**

**మెరుగైన పాలన లక్ష్యంగా ఎన్డీఏ ప్రభుత్వం**

నక్కపల్లి, సెప్టెంబర్ 15: ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు చేపడుతున్నామని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత తెలిపారు. ప్రజల నుంచి అందుతున్న ఫిర్యాదులు, వినతులను ప్రాధాన్యంగా తీసుకుని సంబంధిత శాఖల ద్వారా వేగంగా పరిష్కరించే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. ప్రజలకు మెరుగైన పాలన అందించడమే ఎన్డీఏ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆమె స్పష్టం చేశారు. నక్కపల్లి ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో హోంమంత్రి అధికారులతో విస్తృతంగా చర్చించారు. ప్రజలు తన దృష్టికి తీసుకువచ్చిన వివిధ సమస్యలను ఒక్కొక్కటిగా పరిశీలిస్తూ వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలపై అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. సమస్యల పరిష్కారంలో జాప్యం చోటుచేసుకోకుండా సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

తాగునీరు, రహదారులు, పారిశుద్ధ్యం, సంక్షేమ పథకాల అమలు, రెవెన్యూ సంబంధిత అంశాలు తదితర ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. ప్రజల అవసరాలను గుర్తించి వాటికి అనుగుణంగా చర్యలు తీసుకోవడం ద్వారా ప్రభుత్వంపై ప్రజల విశ్వాసం మరింత పెరుగుతుందని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు. ప్రజలకు అందాల్సిన సేవలు సమయానికి చేరేలా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని హోంమంత్రి ఆదేశించారు. ప్రతి ఫిర్యాదును సీరియస్‌గా తీసుకుని నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలని సూచించారు. ప్రజలతో నేరుగా మమేకమవుతూ వారి సమస్యలను తెలుసుకోవడం ద్వారా సమర్థవంతమైన పాలన అందించగలమని అభిప్రాయపడ్డారు.

ఎన్డీఏ ప్రభుత్వం ప్రజా సంక్షేమం, అభివృద్ధిని సమానంగా ముందుకు తీసుకెళ్తోందని అనిత పేర్కొన్నారు. ప్రజల సమస్యలను కేవలం వినడమే కాకుండా వాటి పరిష్కారానికి క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అన్ని శాఖల అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాలని సూచించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం రాజీ పడబోదని హోంమంత్రి స్పష్టం చేశారు. ప్రజలకు వేగవంతమైన సేవలు అందించడంతో పాటు పారదర్శక పాలనను అమలు చేయడంపై దృష్టి సారిస్తున్నామని చెప్పారు. ప్రజల భాగస్వామ్యంతో అభివృద్ధి కార్యక్రమాలు మరింత సమర్థవంతంగా అమలవుతాయని పేర్కొంటూ, సమస్యల పరిష్కారానికి అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.



# నూతన ఆరోగ్య కేంద్రం ప్రారంభం

**రూ.1.77 కోట్లతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణం**

**దాతలను సన్మానించిన మంత్రి గొట్టిపాటి రవికుమార్**

**వైద్య సేవల నాణ్యతపై ప్రత్యేక దృష్టి**

**గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య సదుపాయాల విస్తరణకు ప్రాధాన్యం**

ప్రకాశం జిల్లా, సెప్టెంబర్ 15: కొరిశపాడు మండలం ప్రాసంగులపాడు గ్రామంలో రూ. 1.77 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రారంభించారు. గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ ఆరోగ్య కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకువచ్చినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు, ప్రజాప్రతినిధులు, వైద్య సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆరోగ్య కేంద్రం ప్రారంభంతో పరిసర గ్రామాల ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు మరింత చేరువ కానున్నాయని మంత్రి పేర్కొన్నారు. ఆసుపత్రి నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని విరాళంగా అందించిన దాతలను మంత్రి ప్రత్యేకంగా సన్మానించారు. సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాల్లో భాగస్వాములై సేవాభావాన్ని చాటిన దాతల సేవలు ఆదర్శప్రాయమని కొనియాడారు. ప్రజా ప్రయోజనాల కోసం ముందుకొచ్చే వ్యక్తులు సమాజ అభివృద్ధికి బలమైన పునాది వేస్తారని అన్నారు. వారి సహకారం వల్లే గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి మౌలిక వసతులు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయని పేర్కొన్నారు.

అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని వివిధ విభాగాలను మంత్రి పరిశీలించారు. రోగుల కోసం ఏర్పాటు చేసిన గదులు, చికిత్సా సదుపాయాలు, మందుల నిల్వలు, తాగునీరు, పారిశుద్ధ్య వసతులు, వైద్య పరికరాల పనితీరును పరిశీలించి అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగికి సకాలంలో సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు అవసరమైన అన్ని వైద్య సదుపాయాలు ఒకే చోట అందుబాటులో ఉండేలా ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని ఆదేశించారు. రోగులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నాణ్యమైన వైద్య సేవలు అందించడం వైద్య సిబ్బంది బాధ్యత అని మంత్రి స్పష్టం చేశారు. అవసరమైన మందులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచాలని, వైద్యులు నిరంతరం విధుల్లో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అత్యవసర పరిస్థితుల్లో రోగులకు వేగంగా సేవలు అందించే విధంగా వ్యవస్థను బలోపేతం చేయాలని సూచించారు. ప్రజల ఆరోగ్య రక్షణలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు ఉండకూడదని హెచ్చరించారు.

పేద, మధ్యతరగతి కుటుంబాలు వైద్య సేవల కోసం పట్టణాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా గ్రామీణ ప్రాంతాల్లోనే మెరుగైన చికిత్స అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తెలిపారు. ఆరోగ్య రంగాన్ని మరింత బలోపేతం చేయడానికి ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతోందన్నారు.



# యుద్ధాల ప్రభావంపై కేఏ పాల్ ఆందోళన

**పెరుగుతున్న ధరలపై తీవ్ర వ్యాఖ్యలు**

**28న శాంతి కార్యక్రమం నిర్వహణ**

విజయవాడ, సెప్టెంబర్ 15, (డిజైనర్ టెక్ గురు ప్రతినిధి) ప్రపంచవ్యాప్తంగా కొనసాగుతున్న యుద్ధాల ప్రభావంతో నిత్యావసర వస్తువులు, ఇంధన ధరలు అదుపు తప్పి పెరుగుతున్నాయని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ ఆందోళన వ్యక్తం చేశారు. వివిధ దేశాల మధ్య నెలకొన్న ఘర్షణలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థను తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయని, దాని ప్రభావం సామాన్య ప్రజల జీవితాలపై స్పష్టంగా కనిపిస్తోందని పేర్కొన్నారు. ప్రపంచంలో చోటుచేసుకున్న అనేక యుద్ధాల ప్రభావం కోట్లాది మంది ప్రజలపై పడుతోందని ఆయన అన్నారు.ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా జరిగిన 58 యుద్ధాల ప్రభావం దాదాపు 200 దేశాల్లో నివసిస్తున్న 850 కోట్ల మంది ప్రజలపై పడిందని కేఏ పాల్ పేర్కొన్నారు. ముఖ్యంగా ఈ ఏడాది ఫిబ్రవరి చివరి నుంచి కొనసాగుతున్న అమెరికా-ఇరాన్ సైనిక ఉద్రిక్తతల కారణంగా అంతర్జాతీయ సరఫరా వ్యవస్థ తీవ్ర ఒత్తిడికి గురైందని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రపంచ వాణిజ్య మార్గాలు, ఇంధన రవాణా వ్యవస్థలు ప్రభావితమవడంతో ధరలు భారీగా పెరుగుతున్నాయని వివరించారు. మార్కెట్లో గతంలో రూ.100కు లభించిన వస్తువులు ప్రస్తుతం రూ.200 నుంచి రూ.300 వరకు విక్రయించబడుతున్నాయని కేఏ పాల్ తెలిపారు. అలాగే పెట్రోల్, గ్యాస్ ధరలు కూడా గణనీయంగా పెరిగి వినియోగదారులపై అదనపు భారం మోపుతున్నాయని చెప్పారు.



# మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గారిని మర్యాదపూర్వకంగా కలిసిన మజ్జి శ్రీను గారు

విజయనగరం, సెప్టెంబర్ 15:ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రివర్యులు శ్రీ కొండపల్లి శ్రీనివాస్ ని విజయనగరం మంత్రి క్యాంప్ కార్యాలయంలో ఇటీవల తెలుగుదేశం పార్టీలో చేరిన ఉమ్మడి విజయనగరం జిల్లా జడ్పీ చైర్మన్ శ్రీ మజ్జి శ్రీనివాసరావు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇరువురు ఆత్మీయంగా మాట్లాడుకుని, జిల్లాలోని రాజకీయ పరిస్థితులు, అభివృద్ధి కార్యక్రమాలు, పార్టీకి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. అనంతరం మంత్రి కొండపల్లి శ్రీనివాస్ క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన పత్రికా సమావేశంలో చిన్న శ్రీను పాల్గొని మీడియాతో మాట్లాడారు.

ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు, మంత్రి శ్రీ నారా లోకేష్ గారి దిశానిర్దేశంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా ద్వితీయ శ్రేణి నాయకులతో కలిసి పని చేస్తామని, తెలుగుదేశం బిజెపి జనసేన పార్టీ నాయకుల సమన్వయంతో రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులను సమాయత్తం చేయడం, నాయకుల, కార్యకర్తల మధ్య సమన్వయంతో ముందుకు సాగడం, అన్ని వర్గాలను కలుపుకొని పార్టీ విజయానికి కృషి చేస్తానని మజ్జి శ్రీను తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు, జనసేన నాయకురాలు తూర్పు కాపు చైర్మన్ పాలవలస యశస్విని, తెలుగుదేశం పార్టీ పోలిట్ బ్యూరో సభ్యురాలు గంట్యాడ శ్రీదేవి, ఏఎంసీ చైర్మన్ పివివి గోపాలరాజు తదితరులు పాల్గొన్నారు



# తెలుగుదేశం పార్టీ నియమాలను పాటించాలి

## దత్తిరాజేరు మండలం నుండి 130 కుటుంబాలు టిడిపి తీర్థం

## పార్టీ కండువాలు కప్పి స్వాగతం పలికిన మంత్రి కొండపల్లి

విజయనగరం, సెప్టెంబర్ 15: తెలుగుదేశం పార్టీలో చేరిన ప్రతి ఒక్కరు తెలుగుదేశం పార్టీ నియమాలను పాటించాలని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సూచించారు. మంత్రి క్యాంప్ కార్యాలయం నందు మంగళవారం దత్తిరాజేరు మండలం మరడాం, మరివలస, అడవి కొత్తవలస గ్రామానికి చెందిన 130 కుటుంబాల వారు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సారథ్యంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. తెలుగుదేశం పార్టీలో చేరిన వారందరికీ పార్టీ కండువాలను కప్పి పార్టీలోకి మంత్రి కొండపల్లి శ్రీనివాస్ స్వాగతం పలికారు. పార్టీలో చేరిన వారిలో మాజీ వార్డు సభ్యులు ముగడ సునీత రామకృష్ణ, వైసీపీ నాయకులు మల్లారపు పైడిరాజు, వర్రీ నాగేశ్వరరావు, పొందూరి సాంబయ్య, ఈదుపల్లి అప్పలనాయుడు తదితరులు తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ వైసీపీ నుండి తెలుగుదేశం పార్టీలోకి రావడం సంతోషంగా ఉందన్నారు. అతి త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో పార్టీ సీనియర్ నాయకులతో కలిసి సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలలో భారీ మెజారిటీతో కూటమి పార్టీ అభ్యర్థులను గెలిపించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో దత్తిరాజేరు పార్టీ అధ్యక్షులు చప్ప చంద్రశేఖర్, తెలుగుదేశం పార్టీ నాయకులు మిత్తిరెడ్డి రామ, తాడి సాంబమూర్తి, ఆలమూరు నారాయణరావు, బంగారీ, పోతల శంకర్రావు తదితరులు పాల్గొన్నారు



# అక్షరాంధ్ర పుస్తకం నిరక్షరాస్యులకు వరం

## మంత్రివర్యులు కొండపల్లి శ్రీనివాస్ చే అక్షర ఆంధ్ర పుస్తకావిష్కరణ

విజయనగరం, సెప్టెంబర్ 15, అక్షరాంధ్ర పుస్తకం నిరక్షరాస్యులకు వాలంటీర్లకు వరం అని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం మంత్రి క్యాంప్ కార్యాలయంలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మరియు ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు లచే అక్షర ఆంధ్ర పుస్తక ఆవిష్కరణ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఈ కార్యక్రమం గురించి ఉపసంచాలకులు వయోజన విద్యాశాఖ శ్రీ అల్లు సోమేశ్వరరావు వివరించడం జరిగింది. ఉల్లాస్ అక్షర ఆంధ్ర మూడవ విడత అక్షరాస్యత కార్యక్రమం లో భాగంగా విజయనగరం జిల్లాలో 1,26,422 మంది నిరక్షరాష్యులకు మరియు 12,642 మంది వాలంటీర్ టీచర్లకు అక్షరాంధ్ర మార్గదర్శిని, అక్షర ఆంధ్ర సంక్షిప్తవాచకం మరియు సాధన పత్రాలు పంపిణీ చేయుటకు ప్రణాళిక సిద్ధం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ జయరాం, ఉపాధ్యాయులు మోహన్ రావు పాల్గొన్నారు.

# ఫీట్ల రోడ్డులో నాలా పూడికతీత పనుల పరిశీలన

సూర్యాపేట, సెప్టెంబర్ 15 :సూర్యాపేట పట్టణంలోని 60 ఫీట్ల రోడ్డులో కొనసాగు తున్న నాలా పూడికతీత పనులను జిల్లా కాంగ్రెస్ నాయ కులు మొరిశెట్టి లక్షాది, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరి కుంట్ల వేణుగోపాల్, మున్సిపల్ కౌన్సిలర్ కొండపల్లి దిలీప్ రెడ్డి మంగళవారం పరిశీలించారు. నాలాలో పేరుకుపోయిన పూడిక, చెత్తను పూర్తిస్థా యిలో తొలగించి మురుగునీటి ప్రవాహానికి ఎలాంటి ఆటంకం లేకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. ముఖ్యంగా వర్షాల సమయంలో నీరు నిలిచి ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా డ్రైనేజీ వ్యవస్థను సమర్థం గా నిర్వహించాలని పేర్కొన్నారు. పూడి కతీత పనులను నాణ్యతతో, వేగంగా పూర్తి చేయడంతో పాటు రహదారిపై రాకపోకలకు అంతరాయం కలగ కుండా జాగ్రత్తలు తీసు కోవాలని కోరారు. ప్రజలు ఎదు ర్కొంటున్న స్థానిక సమస్య లను గుర్తించి వాటి పరిష్కా రాని కి క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షణ కొనసా గిస్తామని నాయకులు తెలిపారు.



# ఇంజనీరింగ్ లో మోక్షగుండంది ఒక ప్రత్యేక శకం

## సీనియర్ ఇంజనీర్ల సలహాలు జూనియర్లు తీసుకోవాలి

### మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గారు

విజయనగరం, సెప్టెంబర్ 15, భారతదేశ ఇంజనీరింగ్ రంగంలో మోక్షగుండం విశ్వేశ్వరయ్యది ఒక ప్రత్యేకమైన శకమని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య 59వ జయంతి సందర్భంగా విజయనగరం జిల్లా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరము నందు ఇంజనీర్స్ డే సెలబ్రేషన్ కార్యక్రమంలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ విజయనగరం ఇంజనీర్స్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఇంజనీర్స్ డే సెలబ్రేషన్ లో మొదటిసారి పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు.ఒక సివిల్ ఇంజనీర్‌గా మోక్షగుండం పుట్టినరోజు కార్యక్రమాల్లో పాల్గొ నడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. 1908 లో హైదరాబాదులో వచ్చిన మూసీ నది వరదలలో తీవ్ర నష్టం వాటిల్లడంతో ఇంజనీర్ గా మోక్షగుండం అద్భుతమైన తన ఇంజనీరింగ్ ప్రతిభతో హైదరాబాద్ నగర రక్షణ కోసం ఉస్మాన్ సాగర్, హిమయత్ సాగర్ లను రూపొందించడంతో పాటు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేశారని, నేటికీ కూడా అదే వ్యవస్థ కొనసాగించడం జరుగుతుందన్నారు.



# సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులచే ప్రత్యేక 'డ్రంక్ అండ్ డ్రైవ్' తనిఖీలు

అమీర్ హుస్సేన్, క్రైమ్ బ్యూరో చీఫ్

వారాంతంలో నిర్వహించిన ప్రత్యేక 'డ్రంక్ అండ్ డ్రైవ్' తనిఖీలలో సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు (జ్యూ) 292 మంది నిందితులను పట్టుకున్నారు. వాహన రకాల వారీగా నమోదు చేసిన కేసుల వివరాలు ఈ క్రింది విధంగా ఉన్నాయి:

ద్విచక్ర వాహనాలు: 240

త్రిచక్ర వాహనాలు: 12

నాలుగు చక్రాల వాహనాలు: 40

భారీ వాహనాలు: 00

నిందితులను వారి రక్తంలోని ఆల్కహాల్ స్థాయిల (దీూజ) ఆధారంగా వర్గీకరించారు:

248 మంది నిందితులలో BAC స్థాయిలు 36 mg/100 ml నుండి 200 mg/100 ml మధ్య ఉన్నాయి.

30 మంది నిందితులలో BAC స్థాయిలు 201 mg/100 ml నుండి 300 mg/100 ml మధ్య ఉన్నాయి.

14 మంది నిందితులలో BAC స్థాయిలు 301 mg/100 ml నుండి 550 mg/100 ml మధ్య ఉన్నాయి.

**నిందితులందరినీ గౌరవనీయ న్యాయస్థానం ముందు హాజరుపరుస్తారు.**

మద్యం సేవించి వాహనం నడపడం తీవ్రమైన నేరమని సైబరాబాద్ పోలీసులు మరోసారి స్పష్టం చేస్తున్నారు. మద్యం మత్తులో వాహనం నడిపి ప్రాణాంతక ప్రమాదానికి కారణమైతే, వారిపై లిభారతీయ న్యాయ సంహిత, 2023లిలోని సెక్షన్ 105 ('హత్యగా పరిగణించబడని నరహత్య' – జబశ్రీజ్యూఖఎశ్రీవ ఎశీఎఱఎఱనవ చీశీ-ాఎశీబత్ఱఅస్త్ర శ్రీ వీబతీనవతీ) కింద కేసు నమోదు చేయబడుతుంది. ఈ సెక్షన్ ప్రకారం గరిష్టంగా 10 సంవత్సరాల జైలు శిక్ష మరియు జరిమానా విధించబడతాయి. గత వారం మరియు ప్రస్తుత వారంలో: గౌరవనీయ న్యాయస్థానాలు మొత్తం 681 'డ్రంక్ అండ్ డ్రైవ్' (ణణ) కేసులను పరిష్కరించాయి. వీటిలో: (18) మందికి జరిమానా మరియు జైలు శిక్ష విధించబడింది, (07) మందికి జరిమానా మరియు సామాజిక సేవ (community service) శిక్ష విధించబడింది, (656) మందికి కేవలం జరిమానా మాత్రమే విధించబడింది.

# పెన్షన్ల దరఖాస్తుకు రెండు రోజుల గడువు పెంపు

## ఎన్టీఆర్ భరోసా పింఛన్ల దరఖాస్తుల గడువు 18వ తేదీ వరకు పొడిగింపు.. మంత్రి కొండపల్లి శ్రీనివాస్

అమరావతి, సెప్టెంబర్ 15: అర్హత ఉన్నప్పటికీ వివిధ కారణాల వల్ల ఇప్పటివరకు ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పింఛన్ కోసం దరఖాస్తు చేసుకోలేకపోయిన వారికి మరో అవకాశం కల్పిస్తున్నట్లు రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్త పింఛన్ల కోసం దరఖాస్తుల స్వీకరణకు ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయించిన గడువును సెప్టెంబర్ 18, 2026 వరకు పొడిగించినట్లు మంత్రి వెల్లడించారు. గతంలో సెప్టెంబర్ 7 నుంచి 16వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించాలని



నిర్ణయించగా, అర్హులైన వారు ఎవరూ అవకాశం కోల్పోకూడదనే ఉద్దేశంతో మరో రెండు రోజులు గడువు పొడిగించినట్లు తెలిపారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు, చేనేత కార్మికులు, మత్స్యకారులు, కల్లుగీత కార్మికులు, డప్పు కళాకారులు, సంప్రదాయ చెప్పుల తయారీదారులు, ట్రాన్స్‌జెండర్లు, వివిధ దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న ఇతర అర్హులైన వర్గాలకు ఎన్టీఆర్ భరోసా పింఛన్ పథకం ద్వారా సామాజిక భద్రత కల్పిస్తున్నామని మంత్రి తెలిపారు. కొత్త పింఛన్ దరఖాస్తుల స్వీకరణ, ఆన్‌లైన్ నమోదు, ఈ-కేవైసీ ప్రక్రియ కోసం రాష్ట్రవ్యాప్తంగా స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు కేంద్రాల్లో అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు మంత్రి తెలిపారు. అర్హులైన వారు నిర్ణీత దరఖాస్తు ఫారాన్ని పూర్తి చేసి, సంబంధిత ధృవపత్రాలతో సమీపంలోని స్వర్ణ గ్రామం లేదా స్వర్ణ వార్డు కేంద్రంలో సమర్పించాలని సూచించారు. దరఖాస్తును ఆన్‌లైన్‌లో నమోదు చేసిన అనంతరం సిస్టమ్ జనరేటెడ్ అక్నాలెడ్జ్‌మెంట్ అందజేస్తారని తెలిపారు. ఇప్పటికే రాష్ట్రంలో 62 లక్షల మంది పింఛనుదారులకు ప్రతి నెలా ఎన్టీఆర్ భరోసా ద్వారా ఆర్థిక భరోసా అందిస్తున్నామని, అర్హత ఉన్న ఒక్క వ్యక్తి కూడా సామాజిక భద్రతకు దూరం కాకూడదన్నదే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. ఇప్పటివరకు దరఖాస్తు చేసుకోని అర్హులు ఈ అదనపు అవకాశాన్ని తప్పనిసరిగా వినియోగించుకుని సెప్టెంబర్ 18వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని మంత్రి విజ్ఞప్తి చేశారు.



# యంగ్ ఇండియా పాఠశాల పనులు వేగవంతం చేయాలి

**భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 15,**

దుమ్ముగూడెం మండలం చిన్నబండి రేవు గ్రామంలో నిర్మిస్తున్న యంగ్ ఇండియా సమీకృత నివాస పాఠశాల నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ అంకిత్ ఐఏఎస్ మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతిని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకుని, పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా నిర్మాణాన్ని పూర్తి చేయాలని సూచించారు. పాఠశాల భవనాలు, తరగతి గదులు, విద్యార్థుల వసతి గృహాలు, ఇతర మౌలిక వసతుల నిర్మాణాన్ని వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. నిర్మాణ ప్రక్రియలో నాణ్యతా ప్రమాణాలు, ప్రభుత్వ నిబంధనలు, సాంకేతిక మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు. ఎలాంటి రాజీ లేకుండా నాణ్యమైన పనులు చేపట్టాలని సూచించారు. విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించేందుకు అవసరమైన అన్ని సదుపాయాలను పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేయాలని కలెక్టర్ తెలిపారు. వసతి, భోజనం, క్రీడలు, గ్రంథాలయం, ప్రయోగశాలలు వంటి సౌకర్యాలను సమగ్రంగా అభివృద్ధి చేయాలని పేర్కొన్నారు. విద్యార్థుల సమగ్ర వికాసానికి అనుకూలమైన వాతావరణం కల్పించాలని సూచించారు. నిర్మాణ పనుల్లో ఎదురవుతున్న సమస్యలను వెంటనే గుర్తించి పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ ఎలాంటి జాప్యానికి అవకాశం ఇవ్వొద్దని సూచించారు. ప్రతి దశలో పనుల నాణ్యతను పరిశీలిస్తూ ముందుకు సాగాలని చెప్పారు.

యంగ్ ఇండియా సమీకృత నివాస పాఠశాలలు గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని కలెక్టర్ పేర్కొన్నారు. విద్యతో పాటు విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి అవసరమైన అన్ని సౌకర్యాలు ఈ పాఠశాలలో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా పనులను పూర్తి చేయాలని తెలిపారు. ఈ పరిశీలనలో తహసీల్దార్ అశోక్ కుమార్, సంబంధిత శాఖల అధికారులు, ఇంజినీరింగ్ అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు. నిర్మాణ పనుల పురోగతిపై కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేస్తూనే, నిర్ణీత గడువులోగా నాణ్యతతో కూడిన పనులు పూర్తి చేయాలని మరోసారి అధికారులకు స్పష్టం చేశారు.



# బాలన్‌పూర్‌లో పంచాయతీ భవనం ప్రారంభం

**ఆదిలాబాద్, సెప్టెంబర్ 15,**

నార్నూర్ మండలంలోని బాలన్‌పూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని జిల్లా కలెక్టర్ రాజర్షిషా, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవా లక్ష్మి మంగళవారం ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల్లో పరిపాలనా సేవలను మరింత సమర్థవంతంగా అందించేందుకు ఈ భవనం ఉపయోగపడుతుందని వారు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజర్షిషా మాట్లాడుతూ గ్రామ పంచాయతీలు గ్రామాభివృద్ధికి కేంద్ర బిందువులుగా పనిచేస్తాయని పేర్కొన్నారు. ప్రజలకు అవసరమైన సేవలను ఒకేచోట అందించేందుకు ప్రభుత్వం ఆధునిక సౌకర్యాలతో పంచాయతీ భవనాలను నిర్మిస్తోందన్నారు. గ్రామస్థులు ఈ సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎమ్మెల్యే కోవా లక్ష్మి మాట్లాడుతూ గ్రామీణాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనతో పాటు పరిపాలనా వ్యవస్థను బలోపేతం చేసే కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. కొత్త పంచాయతీ భవనం గ్రామ ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు దోహదపడుతుందని పేర్కొన్నారు. నూతన భవనం ద్వారా పంచాయతీ కార్యాలయ కార్యకలాపాలు మరింత సులభతరం అవుతాయని అధికారులు తెలిపారు. ప్రజలకు ధ్రువపత్రాలు, సంక్షేమ పథకాల సేవలు, ఇతర పరిపాలనా కార్యక్రమాలు సమర్థవంతంగా అందుబాటులోకి వస్తాయని వివరించారు. గ్రామ పంచాయతీ భవనం ప్రారంభంతో గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. గ్రామాభివృద్ధికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను స్వాగతిస్తూ, మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. ప్రజాప్రతినిధులు, అధికారులు గ్రామస్థులతో కలిసి భవనాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రాజలింగు, మండల అభివృద్ధి అధికారి పుల్లారావు, సర్పంచ్ ఆత్రం సంగీత, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు. గ్రామ అభివృద్ధికి అందరూ సమిష్టిగా కృషి చేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

# భూ రీ-సర్వే వేగవంతం చేయాలి

**భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 15,**





దుమ్ముగూడెం మండలం ముల్కనపల్లిలో జరుగుతున్న భూ రీ-సర్వే పనులను జిల్లా కలెక్టర్ అంకిత్ ఐఏఎస్ మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠతో కలిసి అడవి ప్రాంతంలో సుమారు రెండు కిలోమీటర్లు నడుచుకుంటూ గ్రామ సరిహద్దులు, భూ విస్తీర్ణం, రెవెన్యూ రికార్డులు, సాగుదారుల వివరాలు, సర్వే పురోగతిని పరిశీలిం చారు. భూ రికార్డుల ఖచ్చితత్వం, సర్వే పనుల నాణ్యతపై ప్రత్యేక దృష్టి సారించారు. గ్రామంలో సుమారు 120 మంది ఎంజాయర్స్ ఉన్నట్లు అధికారులు వివరించినప్పటికీ, వారి వివరాలు పట్టాదారు పాస్‌బుక్‌ల స్థితిగతులపై సంబంధిత రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌కు పూర్తి అవగాహన లేకపోవడంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. తమ పరిధిలోని గ్రామా లు, భూములు, సాగుదారులు, పట్టాదారులు, సర్వే నంబర్లు, రికార్డులపై క్షేత్రస్థాయి సిబ్బందికి సంపూర్ణ అవగాహన ఉండాలని స్పష్టం చేశారు. ప్రజలకు సంబంధించిన సమాచా రాన్ని అధికారులు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. గ్రామ సరిహద్దుల నిర్ధారణ పూర్తయినప్పటికీ రీ-సర్వే ప్రక్రియలో జాప్యం ఎందుకు జరుగుతోందనే విషయంపై కలెక్టర్ ఆరా తీశారు. రికార్డులు మరియు క్షేత్రస్థాయి పరిస్థితుల మధ్య ఉన్న విస్తీర్ణ వ్యత్యాసా లను సాంకేతికంగా పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. మ్యాప్‌లు, సర్వే నంబర్లు, భూమి కొలతలను సమన్వయం చేసి భవిష్యత్‌లో భూ వివాదాలకు తావులే కుండా ఖచ్చితమైన రికార్డులను రూపొం దించాలని సూచిం చారు. విధుల నిర్వహణలో నిర్లక్ష్యం, భూ వివరాలపై అవగా హన లోపం, రీ-సర్వే పనుల్లో జాప్యం వంటి అంశా లను తీవ్రంగా పరిగణించిన కలెక్టర్ సంబంధిత రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌పై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఆదే శించారు. అవసరమైతే హోదా తగ్గింపు చర్యలు కూడా చేప ట్టాలని ఉన్నతాధికారులకు సూచించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో ఎలాంటి అలసత్వాన్ని సహించ బోమని స్పష్టం చేశారు. అటవీ, రెవె న్యూ భూముల సరిహ ద్దుల విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహిం చాలని కలెక్టర్ పేర్కొ న్నారు. పాత అటవీ రికార్డులు, సర్వే వివరాలను సేకరించి వాటిని రెవెన్యూ రికార్డులతో సరిపో ల్చాలని సూచించారు. భూ హక్కుల విషయంలో ఎలాంటి సందేహాలు లేకుండా పారదర్శకంగా రికార్డులను సిద్ధం చేయాలని చెప్పారు. ఆధునిక సర్వే పరికరాలను సమర్థ వంతంగా వినియో గించి ప్రతి భూమిని క్షేత్రస్థాయిలో పరిశీలించాలని ఆదేశించారు. దుమ్ముగూడెం మండ లంలో ప్రస్తుతం ఎనిమిది గ్రామాల్లో రీ-సర్వే పనులు కొనసాగు తున్నాయని అధికారులు కలెక్టర్‌కు వివరిం చారు. వాటిలో ఐదు గ్రామాల్లో సరిహద్దుల నిర్ధారణ పూర్తికాగా, మిగిలిన మూడు గ్రామాల్లో గ్రామసభలు పూర్త య్యాయని తెలిపారు. లింగాపురంలో సుమారు 250 ఎకరా ల్లో రీ-సర్వే కొన సాగుతోందని పేర్కొన్నారు. వర్షాలు, బురద, స్థానిక అభ్యం తరాల వల్ల ఏర్పడిన జాప్యాన్ని అధిగమించి నిర్ణీత గడువు లోగా పనులు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదే శించారు. అ ర్హులైన సాగు దారులకు భూ హక్కులపై స్పష్టత కల్పించి పట్టా దారు పాస్‌బుక్‌లు అందేలా రికార్డులను

# దోమల నివారణకు ముందస్తు చర్యలు



మల్కాజిగిరి, సెప్టెంబర్ 15, దోమలు పుట్టిన తర్వాత నియంత్రించడం కంటే అవి పెరిగే ప్రాంతాలను ముందుగానే గుర్తించి నిర్మూలించడమే లక్ష్యమని మల్కాజిగిరి మున్సిపల్ కమిషనర్ స్పష్టం చేశారు. బోయిన్‌పల్లి పరిధిలోని పలు దోమల లార్వా పెరుగుదల కేంద్రాలను మంగళవారం సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. ప్రజారోగ్య పరిరక్షణలో భాగంగా చేపడు తున్న చర్యలను క్షేత్రస్థాయిలో సమీక్షించారు. ఈ సందర్భంగా దోమల లార్వా నిర్మూలన కార్యక్రమాల అమలు తీరును పరిశీలించారు. క్షేత్రస్థాయిలో వినియోగిస్తున్న చికిత్సా పద్ధతులు, తనిఖీల తరచుదనం, పునఃపరిశీలన కార్యక్రమా లపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. దోమల ఉత్పత్తికి అవకాశం ఉన్న ప్రాంతాలను గుర్తించి వెంటనే నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. పరిశీలనలో భాగంగా స్థానిక ప్రజలతో నేరుగా మాట్లాడిన కమిషనర్, దోమల నియంత్రణ సిబ్బంది పనితీరు గురించి వారి అభిప్రాయా లను తెలుసుకున్నారు. సిబ్బంది అందు బాటు, నిర్వహిస్తున్న కార్యక్రమాల ప్రభావం, స్థానికంగా ఎదురవుతున్న సమస్యల పై ప్రజల నుంచి వివరాలు సేకరించారు. ప్రజల సూచనలను పరిగణనలోకి తీసుకుని మరింత సమర్థవం తమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. దోమల పెరుగుదల కేంద్రాలపై నిరంతర నిఘా కొనసాగించాలని కమిషనర్ సూచించారు. అవసరమైన ప్రాంతాల్లో వెంటనే చర్యలు తీసుకోవడంతో పాటు తరచూ పునఃపరిశీలనలు నిర్వహించాలని చెప్పారు. దోమల ఉత్పత్తి మళ్లీ జరగ కుండా క్రమం తప్ప కుండా తనిఖీలు చేపట్టాలని ఆదే శించారు. దోమల ద్వారా వ్యా పించే వ్యాధులను అరికట్ట డంలో ముందస్తు చర్యలే అత్యం త ప్రభావ వంతమని ఆయన పేర్కొన్నారు. ప్రజారోగ్య పరిరక్షణ కోసం అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పరిస రాలను పరిశుభ్రంగా ఉంచ డం ద్వారా దోమల వ్యాప్తిని గణ నీయంగా తగ్గించవచ్చని తెలిపారు. దోమల నియంత్రణ కేవ లం మున్సిపల్ సిబ్బంది బాధ్యత మాత్రమే కాదని, ప్రజల భాగస్వామ్యం కూడా అత్యంత అవసరమని కమిషనర్ అన్నారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, పాత టైర్లు, పాత్రలు, నీరు నిలిచే వస్తువు లను తొలగించాలని సూచించారు. ప్రతి కుటుంబం బాధ్య తగా వ్యవహరిస్తే దోమల వ్యాప్తిని అరికట్టి ఆరోగ్య వంతమైన మల్కాజిగిరిని నిర్మించవచ్చని తెలిపారు.

# బొమ్మా బొరుసు జూదంపై పోలీసుల దాడి

**మెదక్, సెప్టెంబర్ 15,**



హక్కింపేట డ్యామ్ సమీపంలో బొమ్మా బొరుసు జూదం ఆడుతున్న ఏడుగురిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు నిర్వహించిన దాడుల్లో నిందితులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి నగదు, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం, హక్కింపేట డ్యామ్ పరిసర ప్రాంతంలో కొందరు వ్యక్తులు జూదం నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో టాస్క్‌ఫోర్స్ బృందం ఆకస్మికంగా తనిఖీలు చేపట్టింది. ఈ సందర్భంగా బొమ్మా బొరుసు జూదంలో పాల్గొంటున్న ఏడుగురిని పట్టుకుని అరెస్ట్ చేసింది. నిందితుల వద్ద నుంచి రూ.24,510 నగదు, ఆరు సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వారిపై సంబంధిత చట్టాల ప్రకారం కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. జూదం నిర్వహణకు సంబంధించిన ఇతర కోణాలపై కూడా విచారణ కొనసాగిస్తున్నట్లు సమాచారం. ఈ సందర్భంగా జిల్లా పోలీసు అధికారి డి.వి. శ్రీనివాసరావు మాట్లాడుతూ జూదం, బెట్టింగ్ వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమాజంలో శాంతిభద్రతలకు భంగం కలి గించే కార్యకలాపాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించ బోమన్నారు. ప్రజలు చట్టవి రుద్ధమైన జూద కార్యక లాపాలకు దూరంగా ఉండాల ని, ఎక్కడైనా ఇలాంటి వ్యవహా రాలు జరుగుతున్నట్లు తెలిసినా వెంటనే పోలీసులకు సమాచా రం అందించాలని ఎస్పీ సూ చించారు. ప్రజల సహకారంతో జిల్లాలో అక్రమ కార్యకలా పాలను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. జూదం, బెట్టింగ్‌లపై జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక నిఘా కొనసాగుతోందని పోలీసులు వెల్లడించారు. చట్టాన్ని ఉల్లంఘించే వారిపై నిరంతరం దాడులు నిర్వహిస్తూ కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

# చేయూత దరఖాస్తుల పరిశీలన వేగవంతం చేయాలి

**గద్వాల్, సెప్టెంబర్ 15,**



ప్రభుత్వం కొత్తగా మంజూరు చేయనున్న చేయూత పెన్షన్ల కోసం అందుతున్న దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని గద్వాల్ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా సమీకృత కార్యాలయ సముదాయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి వివిధ శాఖల జిల్లా అధికారులతో కలిసి అన్ని మండలాల తహసీల్దార్లు, మండల అభివృద్ధి అధికారులు, ఇతర అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పెన్షన్లు, ఓటరు జాబితా ప్రత్యేక సవరణ, జలసిరి కార్యక్రమం తదితర అంశాలపై సమగ్రంగా చర్చించారు. చేయూత పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకునే వికలాంగ చిన్నారులకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. ఇతర వర్గాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో దరఖాస్తులు వస్తున్నందున అర్హులైన వారిని పూర్తిస్థాయి పరిశీలన అనంతరం పారదర్శకంగా ఎంపిక చేయాలని తెలిపారు. దరఖాస్తుల పరిశీలన పూర్తయిన తర్వాత మండలాల వారీగా అర్హుల వివరాలను నోటీసు బోర్డులపై ప్రదర్శించాలని, అభ్యంతరాలు వచ్చినట్లయితే వాటిని మరోసారి క్షుణ్ణంగా పరిశీలించి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ఓటరు జాబితా సమగ్ర సవరణ కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని కలెక్టర్ సూచించారు. మ్యాపింగ్ పూర్తి కాని, అసాధారణ జాబితాల్లో ఉన్న ఓటర్లందరికీ నోటీసులు జారీ చేయాలని, విచారణకు హాజరుకాని వారి ఇళ్లకు నేరుగా వెళ్లి అవసరమైన పత్రాలు సేకరించాలని బూత్ స్థాయి అధికారులకు ఆదేశించారు. ఎన్నికల సంఘం సూచించిన గుర్తింపు పత్రాలను సేకరించి యాప్ లో నమోదు చేయా లని, సహాయ ఎన్నికల నమోదు అధికా రులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేపట్టాలని చెప్పారు. పదిహే నవ ఆర్థిక సంఘం నిధులతో చేప ట్టిన పనులకు సంబం ధించిన బిల్లులను పరిశీలించి జిల్లా పంచాయతీ కార్యాల యానికి పంపించాలని కలెక్టర్ తెలిపారు. జలసిరి కార్యక్ర మాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకుని వ్యవసాయ భూము ల్లో నీటి కుంటలు, సామూహిక ఇంకుడు గుంతలు, బోర్‌వెల్ రీఛార్జ్ పనులను పెద్ద ఎత్తున చేపట్టాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో నీటి సంరక్షణకు ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. వివిధ మరుగుదొడ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని, ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నెల 17న ప్రజాపాలన దినోత్సవాన్ని అన్ని ప్రభు త్వ కార్యాలయాల్లో నిర్వహించాలని ఆదేశించారు. వినాయక నిమజ్జన కార్యక్రమాలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సూచించారు. సాదా బైనామా, భూభారతి దరఖాస్తులను సకాలంలో పరిష్కరించాలని, భూ రీ-సర్వే పనులను వేగవం తం చేయాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆదేశించారు. ప్రజలకు సంబంధించిన ప్రతి అంశంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. సమావే శంలో అదనపు కలెక్టర్లు మధుమోహన్, నర్సింగరావు, ఆర్డీవో శ్రీనివాసరావు, వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, మండల అభివృద్ధి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పోషణ మాసానికి కలెక్టర్ పిలుపు



**గద్వాల, సెప్టెంబర్ 15**

: ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణా నికి పౌష్టికాహారం అత్యంత కీలకమని, దీనిపై ప్రజల్లో విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. 'మన అంగన్‌వాడి -- మన బాధ్యత' నినాదంతో ఈ నెల 9 నుంచి అక్టోబర్ 8 వరకు నిర్వహిస్తున్న తొమ్మిదవ జాతీయ పోషణ మాసం కార్యక్రమాల అమలుపై మంగళవారం ఐడీఓసీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. పోషకాహార లోపాలను నివారించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అధికారు లను ఆదేశించారు. శిశువులకు తొలి ఆరు నెలల వరకు తల్లిపాల ప్రాముఖ్యతను ప్రతి కుటుంబానికి వివరించా లని కలెక్టర్ సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే బాలామృతం, ఇతర పోషకాహార పదార్థాలను పిల్లలు సద్వినియోగం చేసుకునేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. పోషణ మాసం సందర్భంగా నిర్వహించే కార్యక్రమాల్లో అన్ని లైన్ డిపార్ట్ మెంట్‌ల అధికారులు చురుకుగా పాల్గొని విజయవంతం చేయాలని స్పష్టం చేశారు. ఎత్తుకు తగిన బరువు లేని చిన్నారులపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఆదేశిం చారు. అలాంటి పిల్లలకు ప్రత్యేకంగా చైల్డ్ డెవలప్‌మెంట్ కార్డులు అందజేసి వారి ఆరోగ్య, పోషకాహార వివరాలను క్రమం తప్పకుండా నమోదు చేయాలని సూచించారు. పిల్లల్లో ఆరోగ్య సమస్యలను ముందుగానే గుర్తించి అవసరమైతే హైదరాబాద్‌లో వైద్య పరీక్షలు నిర్వహించి తగిన చికిత్స అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. బరువు తక్కువగా ఉన్న చిన్నారులకు ప్రత్యేక ఆహార కిట్లు అందించేందుకు జిల్లా యంత్రాంగం కృషి చేస్తున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. పోషకాహార లోపాలను తగ్గించేం దుకు అంగన్‌వాడీ కేంద్రాల వద్ద పోషణ వాటికలను ఏర్పాటు చేసి కూరగాయలు, ఆకుకూరల సాగును ప్రోత్స హించాలని సూచించారు. స్థానికంగా లభించే పోషకాహార వనరులను వినియోగించుకోవడం ద్వారా పిల్లల ఆరోగ్యాన్ని మెరుగుపర్చవచ్చని అభిప్రాయ పడ్డారు. జిల్లాలోని హైస్కూల్లు, రెసిడెన్షియల్ విద్యా సంస్థల్లో చదువుతున్న సుమారు 40 వేల మంది విద్యార్థు లకు ఈ నెల 22 నుంచి హెల్త్ కార్డులు అందజేసి సమగ్ర ఆరోగ్య పరీక్షలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. విద్యార్థుల ఆరోగ్య స్థితిగతులను నమోదు చేసి, అవసర మైన వైద్య సేవలను అందించేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని పేర్కొన్నారు. ఆరోగ్య పరిరక్షణతో పాటు పోషకాహారంపై అవగాహన పెంచేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని చెప్పారు. సమావేశం అనం తరం పోషణ మాసానికి సంబంధించిన గోడపత్రి కలను, 'బలమైన బాల్యానికి వెయ్యి మెట్లు' పేరుతో రూపొందిం చిన పుస్తికలను, ఎస్ఎస్ఎఫ్‌పీ (సూపర్వైజ్డ్ సప్లిమెంటరీ ఫీడింగ్ ప్రోగ్రాం) ప్రచార సామగ్రిని కలెక్టర్ విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నర్సింగ రావు, డీడబ్ల్యూఓ సునంద, డీఈఓ విజయలక్ష్మి, డీఎంహెచ్‌వో సంధ్య కిరణ్మయి, డీపీవో శ్రీకాంత్, డీఆర్‌డీఓ ముషాహిదా బేగం, బీసీ సంక్షేమ శాఖ అధికారి అక్బర్ పాషా తదితరులు పాల్గొన్నారు.

# ఎర్రవల్లి కేసులో హైకోర్టు కీలక ఆదేశాలు




**హైదరాబాద్, సెప్టెంబర్ 15 :**

ఎర్రవల్లి పసుపు నీళ్ల వివాదానికి సంబంధించిన కేసులో తెలంగాణ ప్రభుత్వానికి హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ఈ కేసులో నిందితులను వెంటనే అరెస్టు చేయరాదని ధర్మాసనం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. నిందితులకు నోటీసులు జారీ చేసి, చట్టపరమైన విధానాలకు అనుగుణంగా దర్యాప్తు కొనసాగించాలని పోలీసులను ఆదేశించింది. కేసు విచారణ సందర్భంగా పోలీసుల చర్యలపై కోర్టు పలు ప్రశ్నలు లేవనెత్తింది. మంగళవారం జరిగిన విచారణలో కేసు స్వభావం, నమోదు చేసిన సెక్షన్లపై ధర్మాసనం ప్రత్యేకంగా దృష్టి సారించింది. ఏడేళ్లలోపు శిక్ష విధించే సెక్షన్ల కింద కేసులు నమోదైనప్పుడు నిందితులను నేరుగా అరెస్టు చేయాల్సిన అవసరం ఏమిటని పోలీసులను ప్రశ్నించింది. ఇటువంటి సందర్భాల్లో అనుసరించాల్సిన విధానాలపై సుప్రీంకోర్టు ఇప్పటికే స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసిందని గుర్తు చేసింది. సుప్రీంకోర్టు ఆదేశాలను పక్కనపెట్టి అరెస్టుల దిశగా ఎందుకు ముందుకు వెళ్తున్నారని ధర్మాసనం అసంతృప్తి వ్యక్తం చేసింది. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించరాదని, చట్టబద్ధమైన ప్రక్రియను కచ్చితంగా పాటించాలని పోలీసు అధికారులను హెచ్చరించింది. విచారణ పేరుతో అనవసర తొందరపాటు చర్యలు చేపట్టకుండా చట్టం నిర్దేశించిన విధానాన్ని అనుసరించాలని సూచించింది. ఈ వివాదం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు చెందిన ఫామ్‌హౌస్ ఉన్న ఎర్రవల్లి ప్రాంతంలో కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన నిరసన కార్యక్రమం అనంతరం ప్రారంభమైంది. నిరసన జరిగిన ప్రాంతాన్ని బీఆర్ఎస్ కార్యకర్తలు పసుపు నీళ్లతో శుద్ధి చేయడం రాజకీయంగా పెద్ద చర్చకు దారితీసింది. ఈ ఘటనపై అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య తీవ్ర విమర్శలు, ఆరోపణలు కొనసాగుతున్నాయి. పసుపు నీళ్ల ఘటనపై కాంగ్రెస్ నాయకులు, స్థానికులు చేసిన ఫిర్యాదుల ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేశారు. వివిధ చట్టపరమైన సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి, నిందితులను అరెస్టు చేసేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. అయితే అరెస్టు చర్యలు చేపట్టనున్నారనే సమాచారం నేపథ్యంలో పలువురు నిందితులు హైకోర్టును ఆశ్రయించి ఉపశమనం కోరారు. పిటిషన్‌ను పరిశీలించిన హైకోర్టు నిందితుల అరెస్టుపై తాత్కాలికంగా నిలుపుదల విధిస్తూ, తదుపరి చర్యలను చట్ట నిబంధనలకు అనుగుణంగా చేపట్టాలని పోలీసులకు స్పష్టం చేసింది. కేసు దర్యాప్తును కొనసాగించవచ్చని, అయితే నిందితుల హక్కులకు భంగం కలగకుండా వ్యవహరించాలని సూచించింది. ఈ ఆదేశాలతో ఎర్రవల్లి పసుపు నీళ్ల వివాదం మరోసారి రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది.

# కోదాడ్ మెగా ఉద్యోగ మేళాపై మంత్రి సమీక్ష




**సూర్యాపేట, సెప్టెంబర్ 15 :**

కొదాడ్‌లో ఈ నెల 19న నిర్వహిం చనున్న మెగా ఉద్యోగ మేళా ఏర్పాట్లపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మంగళ వారం సూర్యాపేట కలెక్టరేట్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఉద్యోగ మేళా నిర్వహణకు సంబంధించిన అన్ని అంశాలను అధికారులతో చర్చించి ఏర్పాట్ల పురోగతిని పరిశీలించారు. యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకా శాలు కల్పించే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహి స్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఉద్యోగ మేళాలో దాదాపు 300 సంస్థలను ఒకే వేదికపైకి తీసుకురా వడానికి చర్యలు చేపడుతున్నట్లు అధికారులు మంత్రికి వివరించారు. వివిధ రంగాలకు చెందిన సంస్థలు పాల్గొని ఉద్యోగార్థులకు ప్రత్యక్ష ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉద్యోగ అవకాశాల కోసం ఎదురు చూస్తున్న యువతకు ఈ మేళా ఎంతో ఉపయోగపడుతుందని మంత్రి పేర్కొ న్నారు. ఉద్యోగ మేళా ద్వారా 3,500కు పైగా ఉద్యోగ అవకాశాలు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని సమావేశంలో వెల్లడించారు. అర్హతలు కలిగిన యువత ఒకే చోట పలువురు సంస్థల ప్రతినిధులను కలుసుకునే అవకాశం కల్పించడం ద్వారా ఉపాధి అవకాశాలను మరింత విస్తరించవచ్చని మంత్రి అభిప్రాయపడ్డారు. గ్రామీణ ప్రాంతాల యువత కూడా ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపు నిచ్చారు. విద్య పూర్తి చేసిన యువతకు ఉద్యోగ అవ కాశాలు చేరువ కావడానికి పరిశ్రమలు, యువత మధ్య సమన్వయం అత్యంత అవసరమని ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. విద్య మరియు ఉపాధి మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించడంలో ఇలాంటి ఉద్యోగ మేళాలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలకు చెందిన యువతకు పరిశ్రమల ప్రతినిధులతో నేరుగా మమేకమయ్యే అవకాశం కల్పించడం ద్వారా వారి భవిష్యత్తుకు బలమైన పునాది ఏర్పడుతుందని తెలిపారు. ఉద్యోగ మేళా విజయవంతంగా నిర్వహించేందుకు అవసర మైన అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. నమోదు ప్రక్రియ, ఇంటర్వ్యూ కేంద్రాలు, అభ్యర్థులకు అవసరమైన సౌకర్యాలు, రవాణా మరియు ఇతర ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమానికి వచ్చే యువతకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగాలని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కట్టుబడి ఉందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. కొదాడ్ మెగా ఉద్యోగ మేళా ద్వారా వేలాది మంది యువతకు ఉద్యోగ అవకాశాలు లభించే అవకాశం ఉందని పేర్కొన్నారు. పరిశ్రమలు మరియు ఉద్యోగార్థుల మధ్య బలమైన అనుసంధానం ఏర్పడితే గ్రామీణ యువత ఆర్థికంగా ఎదగడంతో పాటు రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములు అవుతారని ఆయన తెలిపారు.

## ఆళ్ల నాని మృతి తీరని లోటు: పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్, సెప్టెంబర్ 15,**

ఆంధ్రప్రదేశ్ మాజీ ఉప ముఖ్యమంత్రి, మాజీ మంత్రి, మాజీ ఎమ్మెల్యే ఆళ్ల నాని ఆకస్మిక మృతి పట్ల తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆళ్ల నాని మరణం ప్రజా జీవితానికి తీరని లోటని పేర్కొంటూ ఆయన కుటుంబ సభ్యులకు, బంధువులకు, అభిమానులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. యూత్ కాంగ్రెస్‌లో పనిచేసిన రోజులను గుర్తు చేసుకున్న పొన్నం ప్రభాకర్, ఆళ్ల నాని తనకు మంచి సహచరుడిగా ఎంతో చురుగ్గా పనిచేశారని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహించిన అనేక ఉద్యమాల్లో కలిసి పనిచేసిన అనుబంధం ఎప్పటికీ గుర్తుండిపోతుందని పేర్కొన్నారు. ప్రజల కోసం పోరాడే నాయకుడిగా ఆయన ప్రత్యేక గుర్తింపు పొందారని అన్నారు. ఆళ్ల నాని మూడు సార్లు ఎమ్మె ల్యేగా ఎన్నికై ప్రజలకు సేవలందించారని మంత్రి గుర్తు చేశారు. ప్రజా సమస్యల పట్ల నిబద్ధతతో వ్యవహరిస్తూ ప్రజల ఆదరణ పొందారని పేర్కొన్నారు. ప్రజలతో సన్నిహితంగా మెలుగుతూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేసిన నాయకుడిగా ఆయన నిలిచిపోతారని తెలిపారు. రాజకీయ జీవితంలో ఆళ్ల నాని తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదిం చుకున్నారని పొన్నం ప్రభాకర్ అన్నారు. వివిధ హోదాల్లో పనిచేస్తూ ప్రజా సంక్షేమానికి కట్టుబడి సేవలందిం చారని పేర్కొన్నారు. ఆయన సేవలను ప్రజలు ఎప్పటికీ గుర్తుంచు కుంటారని అభిప్రాయపడ్డారు. ఆళ్ల నాని మరణం రాజకీయ రంగానికే కాకుండా ప్రజా జీవితానికి కూడా పెద్ద నష్టమని మంత్రి వ్యాఖ్యానించారు. ఆయన లేని లోటు సులభంగా భర్తీ కాదని పేర్కొన్నారు. ప్రజా సేవలో ఆయన చూపిన అంకితభావం ఎంతో మందికి స్ఫూర్తిగా నిలుస్తుందని చెప్పారు. ఆళ్ల నాని ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్న ట్లు పొన్నం ప్రభాకర్ తెలిపారు.





# మావోయిస్టు అగ్రనేత్రి సుశీల లొంగుబాటు

**నిజామాబాద్, సెప్టెంబర్ 15 :**

దశాబ్దాలుగా వామపక్ష తీవ్రవాద ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన సీనియర్ మావోయిస్టు నాయకురాలు, డివిజన్ కమిటీ సభ్యురాలు నక్కా సుశీల రాణి అలియాస్ లత, లలిత, రేలా, జ్యోతి మంగళవారం నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయిచైతన్య ఎదుట అధికారికంగా లొంగిపోయారు. ఆమె సరెండర్‌ను తెలంగాణలో మావోయిస్టు ఉద్యమ చరిత్రలో ఒక కీలక పరిణామంగా పోలీసులు అభివర్ణించారు. సుశీల రాణి లొంగుబాటుతో మావోయిస్టుల పునర్నిర్మాణ సామర్థ్యానికి తీవ్ర దెబ్బ తగిలిందని, రాష్ట్రంలో వామపక్ష తీవ్రవాదం ముగింపు దశకు చేరుకుందని అధికారులు పేర్కొన్నారు. తెలంగాణ పోలీసు శాఖ చేపట్టిన సమగ్ర వ్యూహాలు, స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్, గ్రేహౌండ్స్, జిల్లా పోలీసుల సమన్వయ చర్యలు ఈ విజయానికి ప్రధాన కారణమని వెల్లడించారు. అటవీ ప్రాంతాల్లో మావోయిస్టు కార్యకలాపాలపై నిరంతర నిఘా, సమాచార సేకరణ, పునరావాస విధానాలపై అవగాహన కల్పించడం వంటి చర్యల వల్ల అజ్ఞాత జీవితం గడుపుతున్న పలువురు మావోయిస్టులు సాధారణ జీవన స్రవంతి లోకి తిరిగి వస్తున్నారని తెలిపారు. ఈ ప్రక్రియలో సుశీల రాణి లొంగుబాటు ప్రత్యేక ప్రాధాన్యత సంతరించుకుందని వివరించారు. 2026 సంవత్సరంలో ఇప్పటివరకు తెలంగాణలో రికార్డు స్థాయిలో మొత్తం 266 మంది మావోయిస్టులు హింసా మార్గాన్ని వీడి లొంగిపోయినట్లు పోలీసులు వెల్లడించారు. వీరిలో ముగ్గురు కేంద్ర కమిటీ సభ్యులు, 12 మంది రాష్ట్ర కమిటీ సభ్యులు, ఒక ప్రాంతీయ కమిటీ సభ్యుడు, 25 మంది డివిజనల్ కమిటీ కార్యదర్శులు లేదా సభ్యులు ఉండటం విశేషమని పేర్కొన్నారు. అదనంగా 94 మంది ఏరియా కమిటీ సభ్యులు, 131 మంది సాధారణ మావోయిస్టులు కూడా లొంగిపోవడంతో సంస్థాగతంగా పార్టీ తీవ్రంగా బలహీనపడిందని వివరించారు. అగ్రస్థాయి నాయకత్వం నుంచి క్షేత్రస్థాయి కార్యకర్తల వరకు పెద్ద ఎత్తున లొంగుబాట్లు చోటుచేసుకోవడంతో మావోయిస్టు పార్టీ నెట్‌వర్క్ పూర్తిగా ఛిన్నాభిన్నమైందని అధికారులు తెలిపారు. ఒకప్పుడు తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో ప్రభావం చూపిన మావోయిస్టు నిర్మాణం ప్రస్తుతం తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని పేర్కొన్నారు.



# సైఫాబాద్ స్టేషన్‌లో దాడి కలకలం

**హైదరాబాద్, సెప్టెంబర్ 15**

హైదరాబాద్‌లోని సైఫాబాద్ పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో తన పీఆర్‌వో మహేశ్ మాణిక్య, పీఏ మహేందర్ రెడ్డిపై దాడి జరిగిందంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. యూనిఫాంలో ఉన్న పోలీసు అధికారుల సమక్షంలోనే ముసుగులు ధరించిన సుమారు 15 మంది వ్యక్తులు స్టేషన్‌లోకి ప్రవేశించి పక్కా ప్రణాళికతో ఈ దాడికి పాల్పడ్డారని ఆరోపించారు. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితి ఎంత దారుణంగా మారిందో ఈ ఘటన స్పష్టంగా చూపిస్తోందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హోంమంత్రిగా కూడా వ్యవహరిస్తున్న నేపథ్యంలో ఈ ఘటన ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని కేటీఆర్ విమర్శించారు. తెలంగాణలో ప్రజాస్వామ్య విలువలు దెబ్బతింటున్నాయని, అణచివేతకు తలొగ్గని ప్రతి పౌరుడికి భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులే ఎదురయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. రాజకీయ విభేదాలను ఎదుర్కోలేక అధికార పార్టీ ఇలాంటి చర్యలకు పాల్పడుతోందని ఆరోపించారు. అసెంబ్లీ గేటు ఘటనకు సంబంధించి హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినప్పటికీ, రాజకీయ కక్షసాధింపు చర్యల్లో భాగంగానే తన సిబ్బందిని విచారణ పేరుతో ఉదయం స్టేషన్‌కు పిలిపించి రాత్రివరకు అక్కడే ఉంచారని కేటీఆర్ పేర్కొన్నారు. అనంతరం ముందుగానే రచించిన కుట్రలో భాగంగా ఈ దాడి జరిగిందని ఆరోపించారు. ఈ వ్యవహారం వెనుక ఉన్న అసలు కారణాలను వెలికితీయాల్సిన అవసరం ఉందన్నారు. దాడికి పాల్పడిన వారు కాంగ్రెస్‌కు చెందిన గుండాలా? లేక పోలీసులే మఫ్టీలో ముసుగులు ధరించి వచ్చారా? అనే అంశంపై పూర్తి స్థాయి దర్యాప్తు జరగాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. నిజాలు వెలుగులోకి రావాలంటే సిట్టింగ్ జడ్జి ఆధ్వర్యంలో స్వతంత్ర విచారణ చేపట్టాలని కోరారు. రాజకీయ ప్రభావాలకు అతీతంగా విచారణ జరిగితేనే ప్రజలకు వాస్తవాలు తెలుస్తాయని అభిప్రాయపడ్డారు. సైఫాబాద్ పోలీస్ స్టేషన్ లోపల, బయట ఉన్న సీసీటీవీ ఫుటేజీని వెంటనే భద్రపరచాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఘటనకు సంబంధించిన అన్ని ఆధారాలను సంరక్షించి దర్యాప్తు సంస్థలకు అందించాలని కోరారు. అలాగే గాయపడిన మహేశ్ మాణిక్య, మహేందర్ రెడ్డిలకు తగిన రక్షణ కల్పించి మెరుగైన వైద్య సేవలు అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ ఘటనను నిరసిస్తూ కేటీఆర్ సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్'లో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని ట్యాగ్ చేస్తూ స్పందించారు. 'వెల్‌డన్ కాంగ్రెస్' అంటూ వ్యంగ్య వ్యాఖ్యలు చేశారు. ఈ ఘటనపై రాష్ట్ర రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చ జరుగుతుండగా, బీఆర్ఎస్ నేతలు దీనిని ప్రజాస్వామ్యంపై దాడిగా అభివర్ణిస్తున్నారు.

# వ్యవసాయం, విద్య, వైద్యానికి ప్రాధాన్యం

**జనగామ, సెప్టెంబర్ 15 :**

జిల్లా సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా అధికారులు మరింత బాధ్యతతో పనిచేయాలని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు, జిల్లా అభివృద్ధి సమన్వయ పర్యవేక్షణ కమిటీ అధ్యక్షురాలు కడియం కావ్య సూచించారు. వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు విద్య, వైద్య రంగాలను మరింత బలోపేతం చేయాలని ఆమె పేర్కొన్నారు. జిల్లా ప్రజలకు మరింత చేరువయ్యే వినూత్న కార్యక్రమాలను ప్రారంభించాలని అధికారులకు సూచించారు. మంగళవారం జనగామ సమీకృత కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా అభివృద్ధి సమన్వయ మరియు పర్యవేక్షణ కమిటీ సమావేశంలో ఆమె పాల్గొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలుపై సమీక్ష నిర్వహించారు. అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు సకాలంలో అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యా రంగంలో జిల్లాలో పలు పాఠశాలల్లో మౌలిక వసతుల అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని అధికారులు వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల మెరుగుదల, విద్యార్థుల సంక్షేమం కోసం జిల్లా యంత్రాంగం తీసుకుంటున్న చర్యలను కడియం కావ్య అభినందించారు. పిల్లల్లో మానసిక సమస్యలను ముందుగానే గుర్తించే విధంగా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని, రక్తహీనత నివారణకు అంగన్‌వాడీ స్థాయి నుంచే చర్యలు చేపట్టాలని సూచించారు. వ్యవసాయ రంగంపై ప్రత్యేకంగా చర్చిస్తూ రైతులకు అందుతున్న పథకాల అమలును సమీక్షించారు. నిషేధిత గడ్డి మందుల వినియోగాన్ని పూర్తిగా అరికట్టాలని స్పష్టం చేశారు. భూసార పరీక్షలు, సహజ వ్యవసాయ పద్ధతులు, సాగు ఖర్చుల తగ్గింపుపై రైతులకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. పాల ఉత్పత్తి, చేపల పెంపకం, పశుసంవర్ధక రంగాల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సూచించారు. వైద్య రంగంలో క్షయ వ్యాధి నియంత్రణ, ఆరోగ్య పరీక్షలు, పోషకాహార కార్యక్రమాల అమలుపై సమీక్షించారు. జిల్లాలో మాదకద్రవ్యాల వినియోగాన్ని పూర్తిగా అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. పాఠశాలల్లో నిఘా వ్యవస్థను బలోపేతం చేయడంతో పాటు విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పేర్కొన్నారు. సమావేశంలో ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ జిల్లా అభివృద్ధికి అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. నెల్లుట్ల చెరువు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని, మురుగునీరు చేరకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, పోలీసు అధికారులు, వివిధ శాఖల ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



# ఎస్ఐఆర్ ప్రక్రియపై కలెక్టర్ తనిఖీ

**మహబూబాబాద్, సెప్టెంబర్ 15 :**

మహబూబాబాద్ పట్టణ పరిధిలో కొనసాగుతున్న ప్రత్యేక సమగ్ర సర్వే ప్రక్రియను జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ మంగళవారం క్షేత్రస్థాయిలో ఆకస్మికంగా తనిఖీ చేశారు. సర్వే పనుల పురోగతిని పరిశీలిస్తూ సంబంధిత అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని పలు ప్రాంతాల్లో జారీ చేసిన నోటీసులు, నిర్వహిస్తున్న విచారణల తీరును కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. ప్రజలకు అందిస్తున్న సమాచారం, వారి నుంచి స్వీకరిస్తున్న అభ్యంతరాలు, దరఖాస్తుల పరిశీలన విధానంపై అధికారులను ప్రశ్నించారు. అలాగే సర్వేలో భాగంగా నిర్వహిస్తున్న మ్యాపింగ్ ప్రక్రియను కూడా పరిశీలించి, రికార్డులు మరియు క్షేత్రస్థాయి వివరాల మధ్య ఎలాంటి వ్యత్యాసాలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సర్వే ప్రక్రియలో ప్రతి అంశాన్ని నిబంధనల ప్రకారం నిర్వహించాలని అధికారులకు ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్త కుండా సర్వే, విచారణ ప్రక్రి యలను పారదర్శకంగా, వేగ వంతంగా పూర్తి చేయా లని కలెక్టర్ పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరి వివరాలు సక్రమంగా నమోదు అయ్యేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. సర్వేకు సంబంధించిన అభ్యంత రా లు, ఫిర్యాదులను నిర్దిష్టకా లవ్య వధిలో పరిష్కరించాల ని, క్షేత్ర స్థాయిలో సిబ్బంది సమన్వ యంతో పనిచే యా లని ఆదే శించారు. ప్రజలకు అవస రమైన అవగాహన కల్పిస్తూ ప్రక్రియను విజయ వంతంగా పూర్తి చేయాలని సూచించారు. ఈ తనిఖీలో సంబంధిత శాఖల అధికా రులు, సర్వే సిబ్బంది పాల్గొన్నారు. జిల్లా వ్యాప్తంగా కొనసా గుతున్న ప్రత్యేక సమగ్ర సర్వే ప్రక్రియను నిరం తరం పర్యవేక్షిస్తూ నిర్ణీత గడువులో పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు.



# సఖి సెంటర్‌లో కలెక్టర్ తనిఖీ

**నారాయణపేట, సెప్టెంబర్ 15 :**

నారాయణపేట జిల్లా కేంద్రంలోని ఎర్రగుట్ట వద్ద ఉన్న సఖి (వన్ స్టాప్) సెంటర్‌ను జిల్లా కలెక్టర్ ప్రియాంక మంగళవారం ఆకస్మికంగా సందర్శించి కేంద్ర నిర్వహణ తీరును సమీక్షించారు. ఈ సందర్భంగా సెంటర్‌లోని షెల్టర్ గది, కౌన్సిలింగ్ గది, సమావేశ మందిరంతో పాటు పై అంతస్తులో నిర్వహిస్తున్న షీ టీం విభాగాన్ని పరిశీలించారు. అనంతరం జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారి రాజేందర్ గౌడ్‌తో కలిసి సెంటర్ సిబ్బందితో మాట్లాడి అక్కడ అందిస్తున్న సేవలపై వివరాలు తెలుసుకున్నారు. సెంటర్‌లో నిర్వహిస్తున్న హాజరు రిజిస్టర్‌లు, కేసుల నమోదు పత్రాలు, ఇతర రికార్డులను జిల్లా కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. ఇప్పటివరకు సఖి సెంటర్ ద్వారా ఎంతమంది బాధితులకు సేవలు అందించారో, గత నెల రోజులుగా కేంద్రాన్ని ఆశ్రయించిన బాధితుల సంఖ్య ఎంత అనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. కేంద్రంలో నమోదవు తున్న కేసుల స్వభావం, వాటి పరిష్కార ప్రక్రియపై అధికా రుల నుంచి సమాచారం సేకరించారు. సెంటర్‌కు ఎక్కువగా ఎలాంటి కేసులు వస్తున్నాయని కలెక్టర్ ప్రశ్నించ గా, వివాహాల సీజన్‌లో బాల్య వివాహాలకు సంబంధించిన కేసులు అధికంగా నమోదవు తున్నాయని సెంటర్ బాధ్యురా లు క్రాంతిరేఖ వివరించారు. గృహహింస, లైంగిక దాడులు, వరకట్న వేధింపులు, పోక్సో, అదృశ్యం, అపహరణ, మోసం, ప్రేమ వివాహాలు, ఆశ్రయం కల్పించి న కేసులు, కౌన్సిలింగ్, వైద్య సేవలు, ప్రస్తుతం విచార ణలో ఉన్న కేసుల వివరాలను కలెక్టర్ పరిశీలించారు. బాధితు లకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు సఖి సెంటర్‌లోనే భోజనం అందించే విధంగా ప్రత్యేక వంటగది ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అలాగే కేంద్రం పై అంతస్తులో కొనసాగుతున్న షీటీంవిభాగాన్ని ఇతర అనువైన ప్రదేశానికి తరలించే అవకాశాలపై జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారితో చర్చించారు. బాధితులకు అవస రమైన సేవలు ఒకేచోట అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కోస్గి ప్రాంతానికి చెందిన బాధి తులకు నారాయణపేట కంటే మహబూబ్‌నగర్ చేరుకోవడం సులభమని పేర్కొన్న కలెక్టర్, మహబూబ్‌నగర్ సఖి సెంటర్ నిర్వాహకులతో సమన్వయం చేసుకుని అక్కడే అవసరమైన ఆశ్రయం, సేవలు అందేలా చర్యలు తీసుకో వాలని అధికా రులకు సూచించారు. అలాగే చైల్డ్ వెల్ఫేర్ కమిటీకి సంబం ధించిన కేసుల సంఖ్య, గత రెండు నెలల్లో నమోదైన కేసుల పూర్తి వివరాలను తనకు సమర్పించాలని స్పష్టం చేశారు. సఖి సెంటర్‌లో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేసేం దుకు చర్యలు చేపట్టాలని జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారిని కలెక్టర్ ఆదేశించారు. బాధితులకు అవసరమైన సహాయం, రక్షణ, న్యాయపరమైన సేవలు వేగంగా అందేలా కేంద్రాన్ని మరింత సమర్థవంతంగా నిర్వహించాలని సూచిం చారు. మహిళలు, బాలికల భద్రతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని, అందుకు అనుగుణంగా సఖి సెంటర్ సేవలు మరింత బలోపేతం కావాలని కలెక్టర్ పేర్కొన్నారు.




# నర్సాపూర్ సబ్‌స్టేషన్‌కు అదనపు సామర్థ్యం

**ఆదిలాబాద్, సెప్టెంబర్ 15 :**

ఆదిలాబాద్ జిల్లాలో విద్యుత్ మౌలిక వసతుల బలోపే తానికి మరో కీలక అడుగు పడింది. ఇచ్చోడ సెక్షన్ పరిధి లోని నర్సాపూర్ సబ్‌స్టేషన్‌లో అదనంగా ఏర్పాటు చేసిన 5 ఎంవీఏ సామర్థ్యం గల రెండో పవర్ ట్రాన్స్‌ఫార్మర్ (పీపీటీ ఆర్)ను మంగళవారం విజయవంతంగా ప్రారంభించారు. సాయంత్రం 6.20 గంటలకు ట్రాన్స్‌ఫార్మర్‌ను చార్జ్ చేసి విద్యుత్ వ్యవస్థలోకి తీసుకువచ్చినట్లు అధికారులు వెల్లడిం చారు. ఈ కార్యక్రమాన్ని ఆదిలాబాద్ ఆపరేషన్ సూపరి ంటెండింగ్ ఇంజనీర్ (ఎస్ఈ)తో పాటు సంబంధిత అధికా రులు పర్యవేక్షించారు. సాంకేతిక ప్రమాణాలను పాటిస్తూ ట్రాన్స్‌ఫార్మర్‌ను విజయవంతంగా చార్జ్ చేయడంతో సబ్‌స్టే షన్ సామర్థ్యం మరింత పెరిగిందని తెలిపారు. భవిష్యత్తులో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకొని ఈ విస్తరణ చేపట్టినట్లు అధికారులు పేర్కొన్నారు. నర్సాపూర్ సబ్‌స్టే షన్‌కు అదనపు 5 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్ అందు బాటులోకి రావడంతో విద్యుత్ పంపిణీ వ్యవస్థ మరిం త సమర్థవంతంగా పనిచేసే అవకాశం ఉందని అధికా రులు వివ రించారు. ముఖ్యంగా పీక్ అవర్స్‌లో లోడ్‌ను సమతుల్యం చేయడంలో ఈ ట్రాన్స్‌ఫార్మర్ కీలక పాత్ర పోషించనుంది. దీంతో విద్యుత్ అంతరాయాలు తగ్గే అవ కాశముందని తెలిపారు. ప్రాంతం లోని గృహ, వ్యవసా య, వాణిజ్య వినియోగదారులకు మరింత నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడమే ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. విద్యుత్ సరఫరాలో వోల్టేజ్ సమస్యల ను తగ్గించడంతో పాటు, భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని పంపిణీ వ్యవస్థను మరింత బలోపేతం చేస్తున్నట్లు వెల్లడించారు. తెలంగాణ ఉత్తర విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎన్‌పీడీసీఎల్) ఆధ్వర్యంలో జిల్లాలో విద్యుత్ మౌలిక వసతుల అభివృద్ధికి పలు కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. కొత్త సబ్‌స్టేషన్లు, అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు, లైన్ల విస్తరణ వంటి చర్యల ద్వారా విద్యుత్ సేవలను మెరుగుపర్చేందుకు సంస్థ ప్రత్యేక దృష్టి సారిస్తోంది. నర్సాపూర్ సబ్‌స్టేషన్‌లో చేపట్టిన ఈ సామర్థ్య విస్తరణ కూడా అందులో భాగమేనని అధి కారులు తెలిపారు. విద్యుత్ వినియోగదారులకు విశ్వసనీయ మైన, నిరంతరాయ విద్యుత్ సరఫరా అందించడమే లక్ష్యంగా మౌలిక వసతుల అభివృద్ధి కొనసాగుతుందని టీజీఎన్‌పీ డీసీఎల్ అధికారులు పేర్కొన్నారు. కొత్త ట్రాన్స్‌ఫార్మర్ అందుబాటులోకి రావడంతో ఆదిలాబాద్ జిల్లా పరిధిలోని పలువురు వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సేవలు అందనున్నాయని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.





# రాహుల్, ప్రియాంకతో ఫెలోస్ భేటీ

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 15 :**

లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా న్యూఢిల్లీలోని ఇందిరా భవన్‌లో ఆల్ ఇండియా ప్రొఫెషనల్స్ కాంగ్రెస్‌కు చెందిన డా. మన్మోహన్ సింగ్ ఫెలోస్‌తో సమావేశమయ్యారు. దేశాభివృద్ధి, ప్రజా సమస్యలు, యువత పాత్ర, సామాజిక మార్పు వంటి పలు అంశాలపై ఈ సందర్భంగా విస్తృతంగా చర్చించారు. వివిధ రంగాల నుంచి ఎంపికైన ఫెలోస్ తమ అనుభవాలు, ఆలోచనలను నాయకులతో పంచుకున్నారు. ఈ సమావేశంలో దేశ నిర్మాణంలో యువత, నిపుణుల పాత్ర ఎంత ముఖ్యమో రాహుల్ గాంధీ వివరించారు. సమాజంలో మార్పు తీసుకురావాలంటే కేవలం ఆలోచనలు సరిపోవని, వాటికి ఆచరణ కూడా తోడుకావాలని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను దగ్గరగా అర్థం చేసుకుని వాటి పరిష్కారానికి వినూత్న విధానాలను అనుసరించాలని సూచించారు. ప్రజల అవసరాలే విధానాల రూపకల్పనకు కేంద్రబిందువుగా ఉండాలని చెప్పారు. ప్రియాంక గాంధీ వాద్రా కూడా ఫెలోస్‌తో ప్రత్యేకంగా మాట్లాడారు. యువతలో ఉన్న ప్రతిభ, సామర్థ్యాన్ని దేశ అభివృద్ధి దిశగా మలచాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. సామాజిక బాధ్యతతో ముందుకు వస్తేనే సానుకూల మార్పులు సాధ్యమవుతాయని అభిప్రాయపడ్డారు. ప్రజలతో నిరంతరం అనుసంధానమై వారి సమస్యలకు పరిష్కార మార్గాలు అన్వేషించాలని సూచించారు. డా. మన్మోహన్ సింగ్ ఫెలోషిప్ కార్యక్రమం ద్వారా వివిధ రంగాల నిపుణులకు ప్రజా విధానాలపై అవగాహన పెంపొందించడంతో పాటు, సమాజాభివృద్ధికి తోడ్పడే నాయకత్వ లక్షణాలను పెంపొందించే ప్రయత్నం జరుగుతోందని సమావేశంలో ప్రస్తావించారు. ఫెలోస్ తమ పరిశోధనలు, క్షేత్రస్థాయి అనుభవాలను పంచుకుంటూ పలు సూచనలు చేశారు. దేశం ఎదుర్కొంటున్న ఆర్థిక, సామాజిక, విద్యా, ఉపాధి రంగాల సవాళ్లపై కూడా చర్చ జరిగింది. యువత ఆలోచనలను విధానాల రూపకల్పనలో భాగస్వామ్యం చేయడం ద్వారా సమర్థవంతమైన పరిష్కారాలు సాధ్యమవుతాయని నాయకులు అభిప్రాయపడ్డారు. ప్రజాస్వామ్య బలోపేతానికి యువత చురుకైన భాగస్వామ్యం అవసరమని పేర్కొన్నారు. సమావేశం ముగింపులో ఫెలోస్‌తో రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా సుదీర్ఘంగా ముచ్చటించి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఆలోచనలకు ఆచరణ తోడైతేనే సమాజంలో నిజమైన మార్పు సాధ్యమవుతుందని, ప్రజల జీవితాల్లో సానుకూల పరివర్తన తీసుకురావడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పిలుపునిచ్చారు.



# యుద్ధాభ్యాస్ విన్యాసాలు ప్రారంభం

**డెహ్రాడూన్, సెప్టెంబర్ 15 :**

భారత్ -- అమెరికా మధ్య 22వ సంయుక్త సైనిక విన్యాసం 'యుద్ధాభ్యాస్--2026' మంగళవారం ఘనంగా ప్రారంభమైంది. ఉత్తరాఖండ్‌లోని ఔలీ విదేశీ శిక్షణ కేంద్రంలో ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించగా, రాజస్థాన్‌లోని మహాజన్ ఫీల్డ్ ఫైరింగ్ రేంజ్‌లో కూడా ఏకకాలంలో విన్యాసాలు ప్రారంభమయ్యాయి. ఇరు దేశాల నుంచి తలా 600 మంది సైనికులు ఈ విన్యాసాల్లో పాల్గొంటున్నారు. ప్రారంభ కార్యక్రమంలో భారత సైన్యానికి చెందిన మేజర్ జనరల్ అమరేశ్ గుంజన్, అమెరికా సైన్యానికి చెందిన కల్నల్ బెంజమిన్ జాక్‌మన్ పాల్గొని సైనికులను ఉద్దేశించి ప్రసంగించారు. పర్వత ప్రాంతాలు, అర్ధ పర్వత ప్రాంతాల్లో సమీకృత యుద్ధ దళాల వినియోగ సామర్థ్యాన్ని పెంపొందించడం ఈ విన్యాసాల ప్రధాన లక్ష్యంగా ఉంది. ముఖ్యంగా కాల్బల దళాల ఆధారిత యుద్ధ కార్యకలాపాల్లో ఇరు దేశాల సైన్యాలు పరస్పరం అనుభవాలను పంచుకోనున్నాయి. సవాళ్లతో కూడిన భౌగోళిక పరిస్థితుల్లో సమన్వయంతో చర్యలు చేపట్టే విధానాలపై ప్రత్యేక శిక్షణ అందించనున్నారు. సంయుక్త కార్యాచరణలో పరస్పర అవగాహన పెంపు, కార్యాచరణ విధానాల సమన్వయం, ఆధునిక యుద్ధ వ్యూహాలపై నైపుణ్యాల అభివృద్ధి వంటి అంశాలకు ఈ విన్యాసాలు వేదిక కానున్నాయి. ఇరు దేశాల సైనికులు తమ తమ ఉత్తమ కార్యాచరణ పద్ధతులను పంచుకోవడంతో పాటు సంయుక్త ప్రణాళికలు రూపొందించి అమలు చేసే విధానాలను అభ్యసించనున్నారు. ఈ ఏడాది యుద్ధాభ్యాస్ విన్యాసాల్లో సాంకేతికతకు ప్రత్యేక ప్రాధాన్యం కల్పించారు. నిఘా, సమాచార సేకరణ కోసం డ్రోన్లు, స్వయంచాలక వ్యవస్థల వినియోగంపై విస్తృత శిక్షణ నిర్వహించనున్నారు. ఆధునిక యుద్ధ పరిస్థితుల్లో సాంకేతిక పరిజ్ఞానం పాత్రను మరింత సమర్థంగా వినియోగించే దిశగా ఈ కార్యక్రమాలు రూపొందించబడ్డాయి. రాజస్థాన్‌లోని మహాజన్ ఫైరింగ్ రేంజ్‌లో అత్యాధునిక ఆయుధ వ్యవస్థల ప్రదర్శన కూడా నిర్వహించనున్నారు. ఆధునిక ఆయుధాల సామర్థ్యం, వాటి వినియోగ విధానాలు, యుద్ధరంగంలో వాటి ప్రభావం వంటి అంశాలపై సైనికులకు అవగాహన కల్పించనున్నారు. భవిష్యత్ యుద్ధ సవాళ్లను ఎదుర్కొనేందుకు అవసరమైన సాంకేతిక నైపుణ్యాల అభివృద్ధికి ఈ ప్రదర్శనలు దోహదపడనున్నాయి. భారత్ -- అమెరికా రక్షణ సహకారాన్ని మరింత బలోపేతం చేయడంలో 'యుద్ధాభ్యాస్--2026' కీలక మైలురాయిగా నిలవనుంది. సంయుక్త శిక్షణ, కార్యాచరణ అనుభవాల మార్పిడి ద్వారా ఇరు దేశాల సైన్యాల మధ్య పరస్పర విశ్వాసం, సమన్వయం మరింత పెరగనుంది. ఆధునిక భద్రతా సవాళ్లను ఎదుర్కొనేందుకు అవసరమైన సామర్థ్యాల పెంపుకు ఈ విన్యాసాలు ఉపయోగపడనున్నాయని రక్షణ వర్గాలు పేర్కొన్నాయి.



# హీరోయిన్‌గా మెప్పించి.. రాజకీయ కుటుంబంలోకి రాధిక

సినీ తారల వ్యక్తిగత జీవితానికి సంబంధించిన విషయాలు తరచూ వార్తల్లో నిలుస్తుంటాయి. ముఖ్యంగా హీరోయిన్ల వివాహ వార్తలకు సామాజిక మాధ్యమాల్లో ప్రత్యేక ఆసక్తి ఉంటుంది. ఒకప్పుడు వెండితెరపై కథానాయికలుగా రాణించిన పలువురు ఆ తర్వాత రాజకీయ కుటుంబాల్లోకి అడుగుపెట్టి సినిమాలకు దూరమయ్యారు. అలాంటి వారిలో కన్నడ నటి రాధిక కుమారస్వామి ఒకరు. కన్నడ చిత్రపరిశ్రమలో కథానాయికగా మంచి గుర్తింపు తెచ్చుకున్న ఆమె.. తెలుగులోనూ ఓ సినిమాలో నటించారు. ఆ తర్వాత ప్రముఖ రాజకీయ నాయకుడు హెచ్.డీ. కుమారస్వామిని వివాహం చేసుకోవడంతో ఆమె వ్యక్తిగత జీవితం కూడా ఆసక్తికరంగా మారింది. రాధిక కుమారస్వామి చిన్న వయసులోనే సినిమాల్లోకి అడుగుపెట్టారు. ఆమె తొలి సినిమా సమయంలో తొమ్మిదో తరగతి చదువుతున్నట్లు పలు కథనాలు వెలువడ్డాయి. కన్నడ చిత్రపరిశ్రమలో వరుస అవకాశాలు అందుకుంటూ 2000వ దశకంలో ప్రముఖ కథానాయికగా ఎదిగారు. తన నటనతో ప్రేక్షకులను ఆకట్టుకున్న రాధిక.. ఆ తర్వాత తమిళ చిత్రపరిశ్రమలోకి కూడా అడుగుపెట్టారు. 'యార్కై' సినిమాతో తమిళ ప్రేక్షకులకు పరిచయమయ్యారు. కన్నడతో పాటు ఇతర భాషల్లోనూ నటించిన రాధిక.. తెలుగులోనూ ఓ సినిమాలో కథానాయికగా కనిపించారు. దివంగత నటుడు తారకరత్న కథానాయకుడిగా నటించిన 'భద్రాద్రి రాముడు' చిత్రంలో ఆమె హీరోయిన్‌గా నటించారు. 2004లో విడుదలైన ఈ సినిమాలో రాధిక రెండు విభిన్న ఛాయలున్న పాత్రల్లో నటించి మెప్పించారు





# క్యాస్టింగ్ కౌచ్ ఎదురైంది..

తెలుగు సినీ పరిశ్రమలో వైవిధ్యమైన కథాంశాలతో తెరకెక్కుతున్న చిత్రాలకు ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ లభిస్తోంది. ముఖ్యంగా హారర్, థ్రిల్లర్ సినిమాలు థియేటర్లతో పాటు ఓటీటీలోనూ ఆకట్టుకుంటున్నాయి. అలాంటి చిత్రాల్లో 'మా ఊరి పొలిమేర' ఒకటి. ఎలాంటి భారీ అంచనాలు లేకుండా నేరుగా ఓటీటీలో విడుదలైన ఈ సినిమా అనూహ్య విజయాన్ని అందుకుంది. చేతబడి, క్షుద్ర విద్య వంటి అంశాలను ఉత్కంఠభరితంగా చూపించడంతో ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వచ్చింది. ఈ చిత్రానికి కొనసాగింపుగా తెరకెక్కిన 'పొలిమేర 2' థియేటర్లలో విడుదలై ప్రేక్షకులను ఆకట్టుకుంది. సత్యం రాజేష్, గెటప్ శ్రీను, బాలాదిత్య కీలక పాత్రల్లో నటించిన ఈ సినిమాలో కామాక్షి భాస్కర్ల, సాహితి దాసరి కథానాయికలుగా కనిపించారు. ముఖ్యంగా గెటప్ శ్రీను భార్య పాత్రలో నటించిన సాహితి దాసరి తన నటనతో ప్రేక్షకులను మెప్పించారు. ఈ సినిమాతో ఆమెకు తెలుగు ప్రేక్షకుల్లో మరింత గుర్తింపు లభించింది. తాజాగా సాహితి దాసరి గతంలో చేసిన వ్యాఖ్యలు మరోసారి చర్చనీయాంశంగా మారాయి. సినీ పరిశ్రమలో తాను ఎదుర్కొన్న అనుభవాల గురించి ఓ ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడారు. తనకు క్యాస్టింగ్ కౌచ్ సమస్య ఎదురైందని, కొందరు దర్శకులు, నిర్మాతల నుంచి అవకాశాల కోసం అనుచిత ప్రతిపాదనలు వచ్చినట్లు తెలిపారు. అయితే ఇలాంటి ప్రతిపాదనలు ఎక్కువగా నేరుగా దర్శకులు, నిర్మాతల నుంచి కాకుండా కోఆర్డినేటర్లు, మేనేజర్లు, సహాయ దర్శకుల వంటి మధ్యవర్తుల ద్వారా వస్తాయని చెప్పారు. కొంతమంది మధ్యవర్తులు దర్శకులతో సన్నిహితంగా ఉండాలని, సందేశాల ద్వారా మాట్లాడాలని, వారి నంబర్ ఇస్తామని, అలా చేస్తే మరిన్ని అవకాశాలు వస్తాయని పరోక్షంగా చెప్పేవారని సాహితి దాసరి వెల్లడించారు. అయితే తాను అలాంటి ప్రతిపాదనలను తిరస్కరించినట్లు తెలిపారు. దాని కారణంగా కొన్ని చిత్రాల్లో అవకాశాలు కోల్పోయిన సందర్భాలు కూడా ఉన్నాయని పేర్కొన్నారు. తక్కువ సమయంలో ఎక్కువ గుర్తింపు తెచ్చుకోవడం కంటే.. నెమ్మదిగా ఎదిగి, ఎక్కువకాలం పరిశ్రమలో కొనసాగడమే తన లక్ష్యమని సాహితి దాసరి తెలిపారు. వేగంగా వచ్చే విజయానికి కంటే నిలకడగా సాధించే విజయానికే ఎక్కువ విలువ ఉంటుందని తాను నమ్ముతానని చెప్పారు. తన కెరీర్‌ను కూడా అదే ఆలోచనతో కొనసాగిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు.

# తొలి సినిమాతోనే క్రేజ్.. ఇప్పుడు తెలుగులోకి దివ్య భారతి

సినీ పరిశ్రమలో కథానాయికగా గుర్తింపు తెచ్చుకోవడం అంత సులభం కాదు. ప్రతిభతో పాటు మంచి కథ, ఆకట్టుకునే పాత్ర, సరైన అవకాశం కలిసొస్తేనే హీరోయిన్లకు ప్రేక్షకుల్లో ప్రత్యేక గుర్తింపు లభిస్తుంది. అయితే ప్రస్తుతం సామాజిక మాధ్యమాల ప్రభావంతో కొందరు భామలు ఒక్క సినిమాతోనే, మరికొందరు ఒక్క పాటతోనే యువతలో మంచి క్రేజ్ సంపాదించుకుంటున్నారు. అలాంటి కథానాయికల్లో దివ్య భారతి ఒకరు. దివ్య భారతి తమిళ చిత్రం 'బ్యాచిలర్'తో కథానాయికగా పరిచయమయ్యారు. జీవీ ప్రకాశ్ కుమార్ కథానాయకుడిగా నటించిన ఈ చిత్రానికి సతీష్ సెల్వకుమార్ దర్శకత్వం వహించారు. రొమాంటిక్ కథాంశంతో తెరకెక్కిన ఈ సినిమాలో దివ్య భారతి తన నటనతో పాటు అందంతోనూ ఆకట్టుకున్నారు. ముఖ్యంగా సినిమాలోని పాటలు, ఆమె కనిపించిన తీరు యువతను విశేషంగా ఆకర్షించాయి. దీంతో తొలి సినిమాతోనే ఆమెకు మంచి గుర్తింపు వచ్చింది. 'బ్యాచిలర్' తర్వాత దివ్య భారతి ఫొటోలు, వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. ఆమె అందం, ఆకట్టుకునే రూపం, ఆధునిక శైలి యువతను ఆకర్షించడంతో అభిమానుల సంఖ్య కూడా పెరిగింది. దీంతో తమిళ చిత్ర పరిశ్రమలో దివ్య భారతి పేరు ఎక్కువగా వినిపించింది.



# ఎం.ఎస్. సుబ్బులక్ష్మిగా రష్మిక

నటి రష్మిక మందన్నకు కెరీర్‌లోనే ప్రతిష్టాత్మకమైన అవకాశం దక్కింది. భారతీయ సంగీత చరిత్రలో చెరగని ముద్ర వేసిన ప్రముఖ కర్ణాటక సంగీత విద్వాంసురాలు ఎం.ఎస్. సుబ్బులక్ష్మి జీవితాన్ని ఆధారంగా చేసుకుని తెరకెక్కుతున్న చిత్రంలో రష్మిక ఆమె పాత్రను పోషించనున్నారు. ఈ విషయాన్ని చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. ఈ చిత్రానికి 'ఎం.ఎస్. -- ఎ లెగసీ ఆన్ స్క్రీన్' అనే పేరును ఖరారు చేశారు. గతంలోనే రష్మిక ఈ పాత్రలో నటించనున్నట్లు వార్తలు వచ్చిన విషయం తెలిసిందే. ఈ ప్రతిష్టాత్మక పాత్ర కోసం ఆమె తెరపరీక్షకు కూడా హాజరైనట్లు అప్పట్లో ప్రచారం జరిగింది. తాజాగా చిత్రబృందం అధికారిక ప్రకటన చేయడంతో ఈ వార్తలకు తెరపడింది. ఎం.ఎస్. సుబ్బులక్ష్మి వంటి మహోన్నత వ్యక్తిత్వాన్ని రష్మిక ఎలా ఆవిష్కరించనున్నారనేది ఆసక్తికరంగా మారింది. పాత్రకు తగ్గట్టుగా ఆమె రూపురేఖలు, హావభావాలు, నటనలో ప్రత్యేక మార్పులు తీసుకురానున్నట్లు తెలుస్తోంది. ఈ చిత్రానికి గౌతమ్ తిన్ననూరి దర్శకత్వం వహిస్తున్నారు. భావోద్వేగాలతో కూడిన కథలను సహజమైన శైలిలో తెరకెక్కించడంలో పేరున్న ఆయన.. సుబ్బులక్ష్మి జీవితాన్ని వెండితెరపై ఏ విధంగా ఆవిష్కరిస్తారనే దానిపై ఆసక్తి నెలకొంది. ప్రముఖ సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్ ఈ చిత్రానికి సంగీతం అందించనున్నారు. సుబ్బు లక్ష్మి జీవితం, సంగీత ప్రస్థానం ప్రధాన అంశాలుగా ఉండటంతో సంగీతానికి ఈ చిత్రంలో కీలక ప్రాధాన్యం ఉండనుంది.




# సమంతకు సీమంతం.. ప్రత్యేక వేడుక

టాలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటి సమంత ప్రస్తుతం తన జీవితంలోని ప్రత్యేక దశను ఆస్వాదిస్తున్నారు. 'మా ఇంటి బంగారం' తర్వాత సినిమాలకు కొంత విరామం తీసుకున్న ఆమె.. తన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన విషయాలను అభిమానులతో పంచుకుంటున్నారు. తాజాగా కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితుల సమక్షంలో సమంతకు సీమంతం నిర్వహించారు. ఈ వేడుకకు సంబంధించిన ఫొటోలు, వీడియోలను ఆమె సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నారు. భారతీయ సంప్రదాయాలపై తనకు ఎంతో గౌరవం ఉందని సమంత తెలిపారు. సీమంతం గురించి తొలుత తనకు పెద్దగా అవగాహన లేకపోయినా.. కార్యక్రమంలోని ప్రతి ఆచారం వెనుక ఉన్న ఆధ్యాత్మిక భావనను తెలుసుకున్న కొద్దీ ఇది మరింత ప్రత్యేకంగా అనిపించిందని పేర్కొన్నారు. ప్రతి మంత్రానికి ఒక ఉద్దేశం, ప్రతి సమర్పణకు ఒక అర్థం, ప్రతి కార్యక్రమానికి ఒక ప్రత్యేక స్థానం ఉందని వివరించారు.





Apublished by KALIDINDI SUMALATHA, 1-7-750/1-3, F 103, SRUTHI SADAN APTS ST PIOUS SCHOOL ROAD, RAMNAGAR, HYDERABAD, TELANGANA - 500020. on behalf of RS USAR PUBLICATIONS, 1ST FLOOR, H.NO. 59-5-7, PALLAVI APARTMENTS, ITI COLLEGE ROAD, OPP MRF SHOW ROOM, VIJAYAWADA, N T R, ANDHRA PRADESH - 520008 edited by RAGHURAMA RAJU KALIDINDI and printed by KALIDINDI SUMALATHA at KING DIGITAL OFFSET PRINTERS, 24 11/2-14, LANKAVARI VEEDHI, BHAVAJIPETA 4TH LINE, MAHALAKSHMIGUDI NEAR, VIJAYAWADA, KRISHNA, ANDHRA PRADESH - 520003. PRGI NO: APTEL/26/A7657, Email: rsusarp@myyahoo.com, 9849350555, 9515121467